

అంతా రామమయం
అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు
- 7లో

కొప్పవరం సంబరం
మొక్కులు తీర్చే భిక్షాటన జాతర ఇక్కడి ప్రత్యేకత
- 7లో

జిల్లా ఓటర్లు 16,05,762



ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ తదితరులు

- పురుషులు7,85,142 » మహిళలు 8,20,515 » థర్డ్ జెండర్ 105
- జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 35, 373 మంది అధికం
- రాజమహేంద్రవరం రూరల్‌లో అత్యధికంగా 2,71,159 మంది ఓటర్లు
- కొవ్వూరులో అతి తక్కువగా 1, 83,405 మంది ఓటర్లు
- ఎస్ఎస్ఆర్-2024 ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన కలెక్టర్ మాధవీలత

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. 2024 ఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,05,762 మంది. అందులో పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105 మంది ఉన్నారు. జిల్లాలో పురుషులకంటే మహిళలే ఓటర్లు అధికంగా నమోదయ్యారు. పురుషులకంటే మహిళలు 35,373 మంది ఎక్కువగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్ నమోదైంది. అక్కడ2,71159 మంది ఓటర్లున్నారు. అందులో మహిళలు 1,38,604 మంది ఉండగా, పురుషులు 1,32,531 మంది ఉన్నారు. థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,83,405 మంది, పురుషులు 89, 442 మంది, మహిళలు 93,958 మంది, థర్డ్ జెండర్ అయిదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్యపరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,60360 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 1,34,663 మంది ఉండగా, పురుషులు 1,25,639 మంది ఉన్నారు. థర్డ్ జండర్లు 58 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్లపరంగా మూడో స్థానం ఉంది. ఇక్కడ 2,41,798 మంది ఉండగా, పురుషులు 1,18,783 మంది, మహిళలు 1,23,008 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నారు. అనపర్తి నాల్గో స్థానంలో ఉంది. ఇక్కడ 2,23,255మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 109323 మంది, మహిళలు 113930 మంది, థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 260360 మంది. అందులో పురుషులు 105824మంది, మహిళలు 108083 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు.

నిడదవోలుది ఆరో స్థానం. ఇక్కడ మొత్తం 211874మంది ఓటర్లుండగా, అందులో పురుషులు 103600 మంది, మహిళలు 108269 మంది. కొవ్వూరుది అతి తక్కువ ఓటర్లతో చివరి స్థానం. కాగా ఇంకా ఎవరైనా ఓటు నమోదుకు అర్హులైనవారు ఉంటే, ఈసీఐ ఎన్నికల షెడ్యూల్ జారీచేసినా కూడా నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు వరకూ ఓటు హక్కు పొందవచ్చని కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలిపారు. అభ్యంతరాలు, సవరణల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● 661 మంది సర్వీసు ఓటర్లు

జిల్లాలో ఎస్ఎస్ఆర్ -2024 తుది జాబితా ప్రకారం 661 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. అనపర్తి నియోజకవర్గంలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 45 మంది ఉన్నారు. రాజానగరంలో 64 మంది ఉన్నారు. అందులో స్పౌజ్ కూడా ఉన్నారు. మొత్తం 65 మంది ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 101, స్పౌజెస్ 13తో కలసి మొత్తం 114 మంది ఉన్నారు. ఇక్కడ ఫారన్ సర్వీసు ఓటరు ఒకరు ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 97, స్పౌజెస్ 12 మొత్తం 109 మంది, ఫారన్ సర్వీసు ఓటరు ఒకరు, స్పౌజ్ ఒకరు ఉన్నారు. కొవ్వూరు ఎస్‌సి నియోజకవర్గంలో డిఫెన్స్ ఓటర్లు 109, స్పౌజ్ 2 కలిపి మొత్తం 111మంది ఉన్నారు. నిడదవోలులో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 152 మంది, స్పౌజ్ ఏడు కలిపి మొత్తం 159 మంది ఉన్నారు. గోపాలపురం ఎస్‌సి నియోజకవర్గంలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 83, స్పౌజ్ రెండు కలిపి మొత్తం 85 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 651 మంది, స్పౌజెస్ 37 మంది కలిపి మొత్తం 688 మంది ఉన్నారు. ఫారన్ సర్వీసు ఓటర్లు ఇద్దరు, స్పౌజ్ ఒకరు కలిపి మొత్తం ముగ్గురు ఉన్నారు. డిఫెన్స్, ఫారన్ సర్వీసు ఓటర్లు మొత్తం కలిపి 691 మంది ఉన్నారు.

● 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఓటర్లు

అక్టోబరులో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న కొత్త ఓటర్లు 11,512 మంది చేరగా, తుది జాబితా నాటికి 37,200 మంది పెరిగారు. స్పెషల్ డ్రైవ్, కాలేజీల వంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌తో నమోదు వల్ల ఈ సంఖ్య పెరిగిందని కలెక్టర్ తెలిపారు.

● శాశ్వత వలస, మరణించిన 116 ఓటర్ల తొలగింపు

గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి ఇప్పటివరకూ జిల్లాలో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న 1196 ఇళ్లను గుర్తించారు. అందులో 14,791 మంది ఓటర్లున్నారు. వాటిని విచారణ జరిపి ఫారమ్-8 ద్వారా 5588 మంది ఓటర్ల చిరునామా మార్పు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిపోయివారు, మరణించిన వారు 116 మంది ఓటర్లు ఉండగా ఫారమ్- 7 ద్వారా వారిని తొలగించినట్టు కలెక్టర్ తెలిపారు. జంక్ క్యారెక్టర్ కలిగిన 12 ఇళ్లు గుర్తించారు. అందులో 14మంది ఓటర్లు ఉన్నారు. వాటికి ఫారమ్-8 ద్వారా దరఖాస్తు చేయించారు. ఒకే రివిజన్‌లో రెండు దరఖాస్తులు పెట్టిన కారణంగా ఈ 14 ఫారమ్- 8 లు ఈ-రోల్‌లో అప్‌డేట్ కాలేదు. రివిజన్ పూర్తిచేసిన తర్వాత అప్‌డేట్ చేస్తామని కలెక్టర్ తెలియజేశారు.

● హోం ఓటింగ్ సౌకర్యం

జిల్లాలో 18,722 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు, 80 ఏళ్ల దాటిన ఓటర్లు 28,386 మంది ఉన్నారు. 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారికి, 80 ఏళ్ల దాటిన వారికి వచ్చే ఎన్నికల్లో హోంఓటింగ్ సౌకర్యం ఉందని, దీనికి ఫారమ్-12డి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నియోజకవర్గం- పేరు	పురుషులు 2024	పురుషులు 2023	మహిళ 2024	మహిళ 2023	థర్డ్ జెండర్ 2024	థర్డ్ జెండర్ 2023	మొత్తం 2024	మొత్తం 2023
40. అనపర్తి	109323	106168	113930	109558	2	0	223255	215726
49. రాజానగరం	105824	102239	108083	104187	4	9	213911	213911
50. రాజమహేంద్రవరం సిటీ	125639	123533	134663	131716	58	62	260360	255311
51. రాజమహేంవరం రూరల్	132531	125942	138604	131469	24	16	271159	257427
54, కొవ్వూరు	89442	86463	93,958	90855	5	9	183405	177327
55. నిడదవోలు	103600	101213	108269	104964	5	8	211874	206185
66. గోపాలపురం	118783	115468	123008	118379	7	10	241798	233857
మొత్తం	7,85,142	761026	8,20,515	791128	105	114	1,60,5762	1552268





రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో పోలీసుల నిర్బంధంలో అంగన్వాడీలు.. రైల్వే స్టేషన్‌లో నిర్బంధం

అడుగడుగునా నిర్బంధం

- 'ఛలో విజవాయవాడ'కు వెళ్లకుండా వెయ్యి మందికిపైగా అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు
- ముందస్తు అరెస్టుల సంఖ్యపై గోప్యత » అర్ధరాత్రి ప్రభుత్వంతో ఫలించిన చర్చలు.. సమ్మె విరమణ

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు 'ఛలో విజయవాడ' రాష్ట్రస్థాయి నిరసనకు విజయవాడ వెళ్లకుండా జిల్లావ్యాప్తంగా పోలీసులు ఉక్కుపాదం మోపారు. తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన పోలీసులు ఎక్కడికక్కడ అంగన్వాడీలను అడ్డుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కల్యాణమండపాలకు తరలించి నిర్బంధించారు. అంగన్వాడీలు ఎవరూ బయటకు వెళ్లకుండా పోలీసులు కాపలాగా ఉన్నారు. వారిని నిర్బంధించిన కల్యాణమండపాలు తదితర భవనాల గేట్లకు తాళాలు వేశారు. ఇళ్లకు వెళ్లకుండా విజయవాడ వెళ్లాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించి సాయంత్రం వేళ సొంత పూచీకత్తుపై పంపించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు ఏజెన్సీ ప్రాంతానికి కూడా రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ గేట్‌వే వంటిది. దీంతో తెల్లవారుజాము నుంచే రాజమహేంద్రవరం రైల్వేస్టేషను వద్ద టూటౌన్, ప్రభుత్వ రైల్వే పోలీస్, రైల్వే భద్రతా దళం సిబ్బంది మోహరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రకాశం నగర్ పోలీసులు గస్తీ నిర్వహించారు. రైళ్లల్లో, బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్న మహిళలను ప్రశ్నించారు. అంగన్వాడీలని నిర్ధారణ అయితే వెంటనే వాహనాల నుంచి దించేశారు. వాళ్లందరినీ కల్యాణ మండపాలు తదితర చోట్లకు తీసుకెళ్లారు. రైల్వే స్టేషనులో ఉదయం విజయవాడ ప్యాసింజర్, షిర్డి ఎక్స్‌ప్రెస్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వెళ్లే వరకూ అంగన్వాడీల కోసం వెతుకులాడుతూనే ఉన్నారు. రాజమహేంద్రవరం టూటౌన్, ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వందమందికిపైగా అంగన్వాడీలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ధవళేశ్వరం 11, కడియంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో ఈ సంఖ్య వెయ్యి దాటిందని తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్‌టీజీ కృష్ణా జిల్లా, విశాఖ, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన సుమారు 400 మందిని విజయవాడ తదితర ప్రాంతాల నుంచి బస్సుల్లో తీసుకొచ్చి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, దేవరపల్లి ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్బంధించారు. సాయంత్రం వరకూ నిర్బంధం వదిలేశారు. కాగా చిన్న ఉద్యోగులమైన తాము 42 రోజుల నుంచీ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎన్నో ఇబ్బందులను ఓర్చుకుంటూ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని.. మహిళలని కూడా చూడకుండా తమను ముద్దాయిల మాదిరిగా అరెస్టులు చేసి నిర్బంధించడమేంటని అంగన్వాడీలు ప్రశ్నిస్తున్నారు. తమవల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం లేకపోయినా ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, మహిళలను అడ్డుకోవడానికి పోలీసులను ప్రభుత్వం వినియోగించుకోవడం బాధాకరమంటూ ఆవేదన చెందారు. అంగన్వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.

అంగన్‌వాడీలను టెర్మినేట్ చేస్తాం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధుల్లో చేరని అంగన్వవాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామని, ఇప్పటికే సంబంధిత పత్రాలుపై సంతకాలు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1556 అంగన్వాడీ కేంద్రాల్లో 1538 వర్కర్లు 1493 మంది సహాయకులు ఉన్నారన్నారు. సమ్మె తర్వాత ఇప్పటివరకూ 164 మంది వర్కర్లు, 162 మంది హెల్పర్లు విధుల్లో చేరారన్నారు. ఇంకా ఎవరైనా చేరేవారుంటే మంగళవారం కూడా విధులకు హాజరు కావచ్చని తెలిపారు. మెటర్నిటీ కారణాలతో 9 మంది వర్కర్లు, 16 మంది హెల్పర్లు సెలవులో ఉన్నారని ఆమె చెప్పారు.

సమ్మె విరమణ

అంగన్‌వాడీ సంఘాలతో ప్రభుత్వం సోమవారం అర్ధరాత్రి జరిపిన చర్చలు ఫలించాయి. దాంతో తమ సమ్మె విరమిస్తున్నట్టు అంగన్‌వాడీలు ప్రకటించారు.







(అనపర్తి)

కొప్పవరం సంబరం

సత్తెమ్మ తల్లి కొంగు బంగారం

ధనిక, పేద, కులం, మతం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నీ మొక్కులు చెల్లించడానికి వచ్చాం..కరుణించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. కొంగు బంగారమైన సత్తెమ్మ తల్లి మొక్కులు తీర్చుకున్నారు. అనపర్తి మండలం కొప్పవరంలోని కర్రి వారి సత్తెమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. మూడు రోజులు జరిగే ఈ సంబరం సోమవారం జరిగిన జాతరతో ముగిసింది.





పండుగకి 200 ఏళ్ల చరిత్ర

సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి ఆవిర్భావంపై ఇక్కడ ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రితం ఊతకోటకు చెందిన ఐదుగురు సభ్యులు గల కర్రి వారి వంశీయులు గ్రామంలో పనులు లేక ఏమి చేయాలో పాలుపోని పరిస్థితిలో గోదావరి పాయకు చేరుకుని విచార వదనంలో బాధపడుతుండగా అక్కడకు ఒక పాప వచ్చి వారి కష్టాన్ని అడిగి తెలుసుకుంది. బతికేందుకు మంచి ప్రాంతాన్ని చూపుతానని తనతో రావాలంటూ అనపర్తి మండలం కొప్పవరం గ్రామం తీసుకువచ్చి ఇక్కడ మీరు బతికేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సుఖసంతోషాలతో జీవించాలని చెప్పి అంతర్ధానమైంది. దీంతో వారంతా తమకు దారి చూపేందుకు సత్తెమ్మ తల్లి బాలిక రూపంలో వచ్చిందని నమ్ముతూ ఆమెను అమ్మరూపంగా ఆరాధించడం ప్రారంభించారు. ఇలా జరుగుతుండగా కొప్పవరం చేరుకున్న కర్రి వంశీయులు ఇక్కడ వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ఇలా వారంతా సంతోషంగా బతుకుతున్న తరుణంలో కళ్ళాల్లో ధాన్యం దొంగలపాలవడం ప్రారంభమైంది. ఒక రోజు అమ్మవారు భక్తుడి కలలోకి వచ్చి పంటను దొంగలు దోచుకుంటున్నారని తాను నాగదేవత రూపంలో కళ్ళం వద్ద ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లిన రైతు దొంగలను చూసి ఆశ్చర్యపోయాడు. రైతును చూసిన దొంగలు పరారయ్యారు. నాగ దేవత రూపంలో ఉన్న అమ్మవారు సమీపంలో ఉన్న పాముల పుట్టలోకి వెళ్లి అంతర్ధానమయ్యారు. దీంతో కర్రి వారి వంశీయులు ప్రతి రెండేళ్లకు ఒకసారి జాతరలో నాగదేవతను పూజించడం ఆచారంగా వస్తోంది.



వివిధ వేషధారణల్లో భిక్షాటన చేస్తున్న భక్తులు

3 రోజుల సంబరం

మొదటి రోజు మిద్దెపై ఉన్న కత్తిరి కుండను కిందకు దింపడంతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దింపిన కుండకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు నిర్వహించిన కుండను సంతానం లేని వారు శిరస్సుపై ధరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. రెండో రోజు పుట్ట వద్దకు వేషాలు ధరించి వెళ్లిన భక్తులు అమ్మకు పాలు పోసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని భక్తులు ఆలయ పూజారులతో బడిత పూజ చేయించుకుంటారు. ఇలా చేస్తే వచ్చే రెండేళ్ల పాటు అమ్మ కాపాడుతుందని భక్తుల నమ్మకం.

ఆఖరి రోజున భిక్షాటన జాతర

ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఏదో ఒక విచిత్ర వేషం ధరించి జాతరలో భిక్షాటన చేయాలి. అలా భిక్షం తీసుకోగా వచ్చిన కానుకలను మాత్రమే అమ్మ స్వీకరిస్తుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సోమవారం జరిగిన జాతరలో భక్తులు అనేక వేషాలు ధరించి భిక్షాటన చేశారు. మోతుబరి నుంచి కూలీ వరకు, విద్యాధికుడి నుంచి నిరక్షరాస్యుడి వరకు కుల, మత, జాతి, ధనిక, పేద తారతమ్యం లేకుండా వేషాలు ధరించి భిక్షాటన చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సినిమాలో పాత్రలను వేషాలుగా ధరించిన వ్యక్తులు డైలాగులు వల్లిస్తూ అలరించారు. సాధారణంగా జాతరలు రాత్రి పూట నిర్వహిస్తారు. కానీ ఇక్కడ పగటి పూట నిర్వహించడం విశేషం. సత్తెమ్మ తల్లిని సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, తనయుడు మనోజ్‌రెడ్డి, తెలుగు మహిళలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరామారెడ్డి, ఆళ్ల గోవిందు దర్శించుకున్నారు.








రత్నగిరిపై ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు

అన్నవరంలో శోభాయాత్ర

అన్నవరం, జనవరి 22: అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అన్నవరంలో సంబరాలు అంబరాన్నంటాయి. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం లైవ్ ద్వారా తిలకించాలనే ఉద్దేశ్యంతో ఈవో రామచంద్రమోహన్ ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యదేవుడి క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల ఆలయంలో అభిజిత్ లగ్నంలో ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో పార్టీలకతీతంగా నాయకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వందలాది మందితో ర్యాలీ చేపట్టడంతో రామనామ జపంతో అన్నవరం మార్మోగిపోయింది. కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో శోభాయాత్ర కమిటీ సభ్యులు కామర్స్ చిరంజీవి, పోచినపెద్ది రాధాకృష్ణ, దాసరి నగేష్, ప్రసాద్, గణపతి, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా, టీడీపీ నాయకులు మధుబాబు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముక్కామల కళాకారులు



అంబాజీపేట, జనవరి 22: దేశ రాజధాని డిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ఏపీ ప్రభుత్వ శకటం తరఫున పాల్గొనేందుకు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన కూచిపూడి కళాకారులకు అవకాశం దక్కింది. ఏపీ సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్ సారథ్యంలో ముక్కామలకు చెందిన వాయిద్య కళాకారుడు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కూచిపూడి కళాకారులు ఈనెల14న డిల్లీకి చేరుకున్నారు. అక్కడ శిక్షణ కొనసాగిస్తూ ఈనెల 21న నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రీయ రంగస్థల (ఆర్‌ఆర్) క్యాంపు నిర్వాహకులు అన్ని రాష్ట్రాల కళాకారులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో ఏపీ తరఫున పాల్గొన్న కూచిపూడి కళాకారులు తృతీయ స్థానం సాధించారు. తమకు శిక్షణ ఇచ్చిన గురువు హేమ సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగనృత్య బృందం ఏపీ తరుపున డిల్లీలో ఏకాదశ రుద్రుల శకట ప్రదర్శనలో పాల్గొంది.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం మీదుగా..

సామర్లకోట, జనవరి 22: అయోధ్య రామ మందిరం సందర్శించే భక్తుల సౌకర్యార్థం రైల్వే ఫిబ్రవరి 7,10,11,14 తేదీలలో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట, రాజమండ్రి రైల్వే స్టేషన్ల నుంచి నడుపుతున్నట్లు రైల్వే ట్రాన్స్‌పోర్టేషన్ అధికారి కార్యాలయం నుంచి సోమవారం రాత్రి సమాచారం అందింది.

07217 నంబరు గల రాజమండ్రి-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 7న బుధవారం బయలుదేరనుంది. ఈ రైలు రాజమండ్రిలో ఫిబ్రవరి 7న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు శుక్రవారం రాత్రి 11.00కి చేరుతుంది.

07217 నంబరు పేరిట అయోధ్య డామ్-రాజమండ్రి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 10న శనివారం బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో ఫిబ్రవరి 10న శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజమండ్రి చేరుతుంది.

07218 నంబరు గల సామర్లకోట-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11న బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటలో ఆదివారం రాత్రి 6.30 గంటలకు బయలుదేరి అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు మంగళవారం ఉదయం 10.35కి చేరుతుంది. మొత్తం 1,870 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 40.05 గంటల పాటు ప్రయాణిస్తుంది. 07218 నంబరు గల అయోధ్య-సామర్లకోట మధ్య ఫిబ్రవరి 14న బుధవారం రాత్రి 7.55కి బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో బుధవారం రాత్రి 7.55కి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ అధికారులను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ లేఖలో తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం



తుని రూరల్, జనవరి 22: కాకినాడ జిల్లా తునిరూరల్ మండలం చామవరం శివారు వల్లూరు రోడ్డులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించినట్టు ఎస్‌ఐ విజయ్‌బాబు తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారంతో మృతదేహాన్ని పరిశీలించి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మహిళ వివరాలు తెలియలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రీసెర్చ్ ఫెలోషిప్ సాధించిన యువకుడు

సర్పవరం జంక్షన్, జనవరి 22: యూజీసీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు తిమ్మాపురం ఆక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌కు చెందిన పీజీ విద్యార్థి బాల జయదీప్ ఎంపికయ్యాడు. సోమవారం తిమ్మాపురం పీజీ క్యాంపస్‌లో నిర్వహించిన అభినందన సభలో జయదీప్‌ను ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగానికి చెందిన బాల జయదీప్ యూజీసీ నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఫెలోషిప్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నట్లు జయదీప్ తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాలు, జూనియర్ అసిస్టెంట్ ఎం.లలిత తదితరులు జయదీప్‌ని అభినందించారు.



జయదీప్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వైసీపీ ప్రభుత్వ హయాంలో కాపులకు అన్యాయం

కాపు ఉప కులాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రావులపాలెం, జనవరి 22: కాపు, కాపు ఉప కులాల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని కాపు జేఏసీ నేత ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ కాపు జేఏసీ ఏ పార్టీకీ అనుకూలంగా లేదన్నారు. ముద్రగడ పద్మనాభం సారథ్యంలో గతంలో చేపట్టిన ఉద్యమాలతో కొన్ని ఫలితాలు సాధించామని, అయితే అవి అందలేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, కాపుల సమస్యలపై ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలని, లేనిపక్షంలో ఓటు అనే ఆయుధంతో ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కాపులకు గత ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగాల భర్తీ సమయంలో కాపు, కాపు ఉప కులాలకు చెందిన నిరుద్యోగులు 24వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్నారు. వార్డు నుంచి పార్లమెంటు స్థాయి వరకు పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. నూతన జిల్లాలు ఏర్పడిన సమయంలో ఎందరో ముఖ్య నేతల పేర్లు పెట్టారని, కాపు కులంలో ఉద్యమాలు, పోరాటాలు చేసిన వారి పేర్లు పెట్టలేదన్నారు. నూతన జిల్లాలకు శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా, కూర్మ వెంకటరెడ్డి, కన్నెగంటి హనుమంతు, పెరియార్ రామస్వామి పేర్లు పెట్టాలన్నారు. కార్పొరేషన్ నిధులు ఏడాదికి రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. కాపులకు వెనుకబడిన కేటగిరీల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గత ప్రభుత్వం రూపొందించిన బిల్లును వెంటనే అమలు చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని కాపు కౌలు రైతులకూ అమలు చేయాలన్నారు. ఇదే తరహాలో ఈ నెల 28న విశాఖపట్నంలో జేఏసీ నాయకుడు రాజీవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. రాయలసీమ, భీమవరంలో కూడా సమావేశాలు జరుపుతామన్నారు. సమావేశంలో జేఏసీ ముఖ్య నేతలు తోట రాజీవ్, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణుమూర్తి, వాసిరెడ్డి ఏసుదాసు, చందు, జనార్ధన్, దాసరి రాము, ముత్యాల రామదాసు, ఉమామహేశ్వరి, సీహెచ్ వెంకటరాయుడు, మాక శ్రీనివాస్, ముచ్చర్ల శ్రీరామ్, రంకిశెట్టి మంగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న నేతలు

బాలికను హతమార్చిన సవతి తల్లికి యావజ్జీవం

కాకినాడ క్రైం, జనవరి 22: కన్నతల్లి స్థానంలో ఉండి పిల్లల ఆలనా.. పాలనా చూడాల్సిన సవతి తల్లి స్వార్థపూరిత దుర్బుద్ధితో ఏడేళ్ల బాలికను హతమార్చడమే కాకుండా సాక్ష్యాలు తారుమారు చేసేందుకు మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి ఉప్పుటేరులో విసిరేసిన నేరం ఋజువు కావడంతో ఓ మహిళకు కాకినాడ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. కాకినాడ రూరల్ మండలం, తూరంగి పగడాలపేటకు చెందిన సూరాడ సత్యశ్యామ్‌కుమార్ గతంలో సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పని చేస్తూ రాజమహేంద్రవరంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండేవాడు అక్కడ సత్యవతి అనే ఆమెను 2012లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి 2013లో దీప్తి శ్రీ ఇషాని పుట్టింది. అయితే 2016 లో సత్యవతి బ్రెయిన్ హేమరేజ్‌తో మృతి చెందింది. దాంతో దీప్తికి తల్లి లేని లోటు తీర్చేందుకు శ్యామ్‌కుమార్‌కు అతని కుటుంబీకులు 2017లో కాకినాడ డైరీఫామ్ సెంటర్, సంజయ్‌నగర్‌కు చెందిన శాంతికుమారిని ఇచ్చి వివాహం జరిపించారు. వారికి 2018 లో మోక్షిత్ నూతన్ అనే కుమారుడు జన్మించాడు. అయితే శ్యామ్‌కుమార్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆ కుటుంబం కాకినాడ డైరీఫామ్ సెంటర్‌కు వచ్చేసింది. అనంతరం తన భర్త పేరున ఉన్న ఇల్లు తన కుమారుడికి కాకుండా దీప్తి పేరున రాసేస్తారేమోనని అపోహ పడి అప్పటి నుంచి కన్న కూతురిలాంటి దీప్తిపై కక్ష పెంచుకుని ఎలాగైనా ఆ చిన్నారిని అంతం చేయాలని పథకం రచించింది. ఈ క్రమంలో తన నానమ్మ ఇంటి వద్ద ఉంటూ జగన్నాథపురం నేతాజీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న దీప్తి వద్దకు శాంతికుమారి 2019 నవంబరు 22న మారు వేషంలో వెళ్లి దీప్తిని ఎవరికి చెప్పకుండా ఇంటికి తీసుకుని వచ్చి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ సంచిలో మూట కట్టి ఇంద్రపాలెం బ్రిడ్జి పై నుంచి ఉప్పుటేరులోకి విసిరేసి సాక్ష్యం లేదు తనకి ఏమీకాదులే అనుకుని అక్కడ నుంచి వెళ్లిపోయింది. అనంతరం స్కూల్ నుంచి ఇంటికి రాకపోయేసరికి తన కుమార్తె దీప్తి కనబడడంలేదని సత్యశ్యామ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి వన్‌టౌన్ సీఐ టి.రామ్మోహన్ రెడ్డి దర్యాప్తు జరిపి నిందితురాలు శాంతికుమారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితురాలిపై నేరం ఋజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వై.ప్రశాంతికుమారి వాదించారు. సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టడంలో విశేష కృషి చేసిన ప్రస్తుత వన్‌టౌన్ సీఐ వాడవెల్లి సురేష్‌బాబు బృందాన్ని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ అభినందించారు.

సముద్ర తీరానికి వెదురు మండపం

అంతర్వేది, జనవరి 22: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పంచాయతీ హైస్కూలు రోడ్డుకు ఆనుకుని ఉన్న సముద్ర తీరం ఒడ్డుకు శ్రీలంకకు చెందిన వెదురుకర్రల మండపం కొట్టుకు వచ్చింది. తీరం వెంబడి శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న సందర్భంలో సముద్ర కెరటాలకు కొట్టుకువచ్చిన వెదురు కర్రల పల్లకీ చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. వివిధ రకాల ఇత్తడి కిరీట భాగాలు, బౌద్ధ మతాకి చెందిన పేయింటింగులు, శ్రీలంక భాషతో ఉన్న కర్టెన్లతో కూడిన మండపాన్ని చూసేందుకు అంతర్వేది గ్రామ ప్రజలంతా సముద్ర తీరం వెంబడికి తరలి వెళ్లారు. ఈ వెదురు కర్రల మండపం రాష్ట్ర, దేశాల నుంచి అంతర్వేది సముద్ర తీరానికి కొట్టుకు రావడంతో ఆధ్యాత్మిక భావన ప్రజల్లో కలిగి చూసేందుకు ఎగబడ్డారు.



అంతా రామమయం

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు హనుమాన్ చాలీసా నృత్య రూపకాన్ని ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. హనుమ వేషధారణలతో చిన్నారులు చక్కటి ప్రదర్శన ఇచ్చారు..



రాజమహేంద్రవరంలో నృత్య రూపకం




హోరాహోరీగా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 22: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 3వ రోజు సోమవారం పోటాపోటీగా కొనసాగాయి. 19 ఏళ్లలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈనెల 24 వరకూ కొనసాగనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలో గల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. సోమవారం మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించగా టీమ్ విభాగంలో హరియాణా, గుజరాత్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హరియాణా జట్టు 2-0 స్కోర్‌తో విజేతగా నిలిచిందన్నారు. అదే విధంగా ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో డిల్లీ నిలిచినట్లు తెలిపారు. సింగిల్స్ మ్యాచ్‌లు మొదటి, రెండు రౌండ్‌లు పూర్తయ్యాయన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి,శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు పర్యవేక్షించారు.

భారీగా సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు అనుమతుల్లేని బ్రాండ్ల సిగరెట్లను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేశ్‌బాబు వివరాలను వెల్లడించారు. అనుమతులు లేని సిగరెట్ల విక్రయాలపై సోమవారం సోదాలు చేశామన్నారు. రాజమహేంద్రవరం స్టేడియం రోడ్‌లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీదేవి బిస్కెట్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.1.75 లక్షల విలువ చేసే పారిస్, గోల్డ్‌ఫైటర్, ఎ-10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ తదితర అనుమతుల్లేని బ్రాండ్ల 4,010 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దుకాణం యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి టూటౌన్ పోలీసులకు అప్పగించినట్టు ఎస్పీ వివరించారు. అనుమతుల్లేని సిగరెట్ల అమ్మకం, గుట్కాలను విక్రయించడం, రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై నిరంతర నిఘా పెట్టామని.. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ జగన్నాథరెడ్డి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణహత్య



చాగల్లు, జనవరి 22: మండలంలోని చంద్రవరం గ్రామంలో ఓ మహిళ సోమవారం దారుణ హత్యకు గురైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత(48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింటు వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్యకుమార్ కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. సోమవారం ఇంటి డాబాపై సుజాత బట్టలు ఆరవేస్తున్న సమయంలో కత్తితో మెడపై బలంగా దాడి చేశాడు. అనంతరం డాబా పైనుంచి హడావిడిగా పారిపోతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైపీ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా సుజాతను హత్య చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

జిల్లాలో 7,61,255 మంది ఓటర్లు

తుది ఓటరు జాబితా ప్రకటన

పురుషులు 3,66,386, మహిళలు 3,94,832, ఇతరులు 37 మంది

పాడేరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది ఓటరు జాబితాను అధికారులు సోమవారం ప్రకటించారు. జిల్లాలోని 22 మండలాల్లో 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 3,66,386 మంది, మహిళలు 3,94,832 మంది, ఇతరులు 37 మంది ఉన్నారు. జిల్లాలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 44 వేల 925 మంది ఓటర్లు కాగా, వారిలో పురుషులు 1,18,154 మంది, మహిళలు 1,26,755 మంది, ఇతరులు 16 మంది ఓటర్లున్నారు. అలాగే అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మ్మొతం 2 లక్షల 41 వేల 360 మంది ఓటర్లలో పురుషులు 1,17,460 మంది, మహిళలు 1,23,894 మంది, ఇతరులు 6 మంది ఓటర్లున్నారు. అలాగే రంపచోడవరం అసెంబ్లీ నియోజవర్గంలో మొత్తం ఓటర్లు 2 లక్షల 74 వేల 970 మంది ఓటర్లులో పురుషులు 1,30,772 మంది, మహిళలు 1,441,83 మంది, ఇతరులు 15 మంది ఓటర్లున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,021 పోలింగ్ కేంద్రాలు కాగా, వాటిలో పాడేరు నియోజకవర్గంలో 318, అరకులోయలో 304, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలున్నాయి.

గత ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు 1,10,290 మంది

జిల్లాలో గత ఐదేళ్లలో 1,10,290 మంది ఓటర్లు పెరిగారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయానికి జిల్లాలో మొత్తం 6 లక్షల 50 వేల 965 మంది ఓటర్లుండగా, తాజాగా వెల్లడించిన జాబితా ప్రకారం 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లున్నారు. అంటే అదనంగా ఒక లక్షా 10 వేల 290 మంది ఓటర్లు పెరిగారు.

రంపలో శ్రీరామ ప్రతిష్ఠ సంబరాలు


రంపలో శోభాయాత్ర

రంపచోడవరం, జనవరి 22: ఆయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం రంపచోడవరంలో రామభక్తులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక రామాలయం వద్ద బాలు కేబుల్, శ్రీదేవి సప్లైకో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేయగా భక్తులు ప్రత్యక్షంగా అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ఠను వీక్షించారు. అంతకు ముందు రామనామస్మరణ చేసుకుంటూ ప్రదర్శన నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం నిర్వహించారు.

శ్రీరామునికి ప్రత్యేక పూజలు

మోతుగూడెం, జనవరి 22: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీలో సోమవారం డొంకరాయి ఏపీజెన్కో కల్యాణ మండపంలో అయోధ్య బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని విశేష పూజలు, మంగళ హారతులు ఇచ్చారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను తెరపై చూసే అవకాశం కలిగినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో ధారబాబు, మురారి శ్రీను, రామ గణేష్, దొడ్డ సురేష్, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయాల్లో వేడుకలు

రాజవొమ్మంగి జనవరి 22: అయోధ్యలో సోమవారం జరిగిన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని గిరిజన గ్రామాలు రామ నామస్మరణతో మార్మోగాయి. దాదాపు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామస్థులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గ్రామాల్లో నగర సంకీర్తనలు చేశారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కళకళలాడిన రామాలయాలు

వై.రామవరం జనవరి 22: అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వై.రామవరం మండలంలో పలు రామాలయాల్లో రామనామస్మరణ మారుమోగింది. స్థానిక బస్ సెంటర్‌లోని రామాలయం, వాల్మీకి పేటలోని రామాలయాల వద్ద ఘనంగా పూజలు జరిపారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సాయంత్రం రామాలయాల్లో దీపాలు వెలిగించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

రామ భక్తుల సందడి

వరరామచంద్రాపురం, జనవరి 22: మండల కేంద్రంలో రామ భక్తులు జైశ్రీరామ్ అంటూ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. వీఆర్ పురంలోని రామాలయంలోను, శ్రీరామగిరిలోని శ్రీసుందర సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలోను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రేఖపల్లి, వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, అన్నవరం, చింతరేవుపల్లి, ఉమ్మడివరం, సీతంపేట గ్రామాల్లో రామభక్తులు జైశ్రీరామ్.....జైశ్రీరామ్ అంటూ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీల అరెస్టును ఖండిస్తూ రేఖపల్లిలో రాస్తారోకో

వరరామచంద్రాపురం, జనవరి 22: విజయవాడలో తలపెట్టిన ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ఎంపీపీ కారం లక్ష్మి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల కోసం ధర్నాలో పాల్గొంటే అరెస్టు చేయడం దారుణమన్నారు. సున్నం రంగమ్మ, సుబ్బారావు, మండల కార్యదర్శి వద్దాది రమేష్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

రంపచోడవరం, జనవరి 22: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఆయా సమస్యలను విన్నవిస్తూ వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులకు వాటిని పంపించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించాలని, అంతే కాకుండా ఆయా సమస్యలపై తీసుకున్న చర్యలను ఆయా దరఖాస్తుదారులకు తెలియజేయాలని కూడా సూచించారు.

వై.రామవరం ఎంపీడీవోగా యాదగిరేశ్వరరావు

వై.రామవరం జనవరి 22: వై.రామవరం ఎంపీడీవోగా ఎల్.యాదగిరేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజవొమ్మంగి మండలంలో ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై వై.రామవరం వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా గంగవరం ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఉన్నారు.

102 కిలోల గంజాయి స్వాధీనం



మోతుగూడెం, జనవరి 22: వేర్వేరు కేసుల్లో అల్లూరి జిల్లా మోతుగూడెం పోలీసులు 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన రూపేష్, తానాజీ, నాయక్, గౌతమ్ 100 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణకు చెందిన జక్కంపూడి సాయికుమార్ రెండు కిలోల గంజాయిని తీసుకెళ్తుండగా మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు పట్టుకున్నారు. రెండు కేసుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ రూ.5.10 లక్షలు ఉంటుందని పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పాడేరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు సంపూర్ణంగా సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ నేతలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సవరణలో భాగంగా శాశ్వత వలస, మృతి చెందిన 19,394 ఓట్లను తొలగించామన్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎన్నికల కమిషన్ సూచనలు పాటించడంతోపాటు స్థానికంగానే పక్కాగా పరిశీలన, నిర్ధారణ చేశామన్నారు. కొత్తగా 40,096 మందిని ఓటరు జాబితాలో చేర్చామన్నారు. అన్ని ప్రక్రియల అనంతరం జిల్లాలో మొత్తం 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లుకాగా, వారిలో పురుషులు 3,66,386 మంది, మహిళలు 3,94,832 మంది, ఇతరులు 37 మంది ఓటర్లున్నారన్నారు.

నిమ్మలపూడి గోవింద్‌కి అక్కినేని అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 22: అక్కినేని నాగేశ్వరరావు 10వ వర్ధంతి సందర్భంగా జిత్‌మోహన్ మిత్ర కళావేదికలో గంగరాజు కోవా అధినేత నిమ్మలపూడి గోవింద్‌ని అక్కినేని అవార్డుతో సత్కరించారు. సభ్యాధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు జిత్ మోహన్ మిత్ర, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, సన్నిధానం శాస్త్రి మాట్లాడుతూ అక్కినేని నటనను కొనియాడారు. గోవింద్‌కి అక్కినేని అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. అక్కినేని అభిమాని మరిడయ్య, డాక్టర్ గిరిజాల సోమరాజు నాయుడు, వి.జగపతి పాల్గొన్నారు.

అంతా రామమయం!

- శ్రీరామ నామంతో మార్మోగిన గ్రామాలు
- భజనలు, రామదాసు కీర్తనలతో ఆధ్యాత్మిక శోభ
- రామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు, కల్యాణాలు
- గోకవరంలో కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- 32 గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి రూ.52లక్షలు విరాళం


గోకవరంలో ర్యాలీలో పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం, జనవరి 22: జై శ్రీరామ్, జైజై శ్రీరామ్, జయజయ రామా అంటూ గ్రామాలన్నీ మార్మోగాయి. భక్తుల జయజయ ధ్వానాలతో భక్తిపారవశ్యం వెల్లివిరిసింది. అయోధ్య రామాలయంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని గ్రామస్థులు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాముడి భజనలు, రామదాసు కీర్తనలతో పరవశించిపోయారు. సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్నుల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీల్లో ఉంచి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాలు, శోభాయాత్రలు చేపట్టారు. కాషాయ జెండాలతో ర్యాలీలు జరిపారు. గోకవరం మరో అయోధ్యను తలపించింది. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామజేన వ్యవస్థాపకుడు, సీఎండీ కేఎస్‌పీవీ ఫిన్స్ అధినేత కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాషాయ జెండాలతో వేలాదిమంది రామభక్తులు, రామసేవకులు సంప్రదాయ దుస్తులు ధరించి జైశ్రీరామ్ అంటూ సందడి చేశారు. సీఎండీ కేఎస్‌పీవి ఫిన్స్ లేఅవుట్‌లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ముందుగా శ్రీరాముడి గొప్పతనాన్ని, హిందూ ధర్మం విశిష్టతను శ్రీనివాసరావు భక్తులకు వివరించారు. అనంతరం శ్రీరామ పాదుకపూజ, అఖండ రామ నామ జపం నిర్వహించారు. తదనంతరం అన్నదానం చేపట్టారు. కాగా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 1000 మోటారు సైకిళ్ళు, సుమారు 400 ఆటోలు, కార్లు, ఇతర వాహనాలతో మధ్యాహ్నం 2గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ర్యాలీ సాగింది. భక్తులు స్వచ్ఛందంగా ఇళ్ల నుంచి బయటకు వచ్చి ర్యాలీకి స్వాగతం పలకడం విశేషం. భక్తులకు పలు గ్రామాల్లో పానకం, మంచినీరు, అల్పాహారం అందజేశారు. మండలంలోని 32 గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి రూ.52 లక్షలను విరాళంగా అందజేస్తున్నట్టు కంబాల శ్రీనివాసరావు ప్రకటించారు. హిందూధర్మ పరిరక్షణకు లక్షల రూపాయల సొంత ధనాన్ని వెచ్చిస్తున్న ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

సీతానగరం: మండలంలోని రామచంద్రపురంలో గ్రామస్థులు రామనామం జపిస్తూ స్వామివారిని ఊరేగించి, రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామనామ జపం యజ్ఞం నిర్వహించి భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. మునికూడలి గ్రామంలో నీరుకొండ వీరన్నచౌదరి ప్రోద్బలంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి సారె అందించి, పురవీధుల్లో కాషాయ జెండాలతో స్వామివారిని ఊరేగించారు. భక్తులకు భోజన వసతి కల్పించారు. సీతానగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలసి బైక్ ర్యాలీ జరిపి స్వామివారిని ఊరేగించారు. కాషాయ జెండాలతో ఊరేగడంతో పురవీధులు కాషాయ రంగుతో మెరిసిపోయాయి. అలాగే చినకొండేపూడి, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో శ్రీరామనామ జపం చేస్తూ స్వామివారిని ఊరేగించారు. మండలంలోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.


దివాన్‌చెరువులో సీతారాములను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని శ్రీరాంపురం రోడ్డులో ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి శ్రీరామకోటి నామ లిఖితం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రామకోటిని రాశారు. ఈవిధంగా 250మందికి రామకోటి పుస్తకాలను అందజేస్తున్నామని, మూడు నెలల్లో పూర్తిచేసి ఆ పుస్తకాలను తమకు అందజేస్తారని, వాటిని తాము భద్రాచలంలోని శ్రీరామువారి ఆలయానికి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి భగవద్గీత పుస్తకాలు అందజేశారు. అలాగే ఇక్కడి కోదండ రామాలయంలో కల్యాణం నిర్వహించారు. గ్రామంలో స్కూటర్‌ర్యాలీ నిర్వహించారు. అన్నదానం చేశారు. అలాగే స్థానిక బీజాపురి


కడియం దేవీచౌక్ సెంటర్‌లో చిన్నారుల హనుమాన్‌చాలీసా నృత్యరూపకం

టౌన్‌షిప్‌లో సీతారాములను మంగళవాయిద్యాలతో ఊరేగించి పవిత్ర అక్షింతలను పంపిణీ చేశారు. ఇక్కడి పండ్ల మార్కెట్ వద్ద పులిహోర వితరణ చేశారు. ఆగమాశ్రమంలో శ్రీరామునికి అష్టోత్తర పూజ చేశారు. సాధుపేటలో ముగ్గులపోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణపట్నం, పాలచర్ల, శ్రీరాంపురం, తదితర గ్రామాల్లోనూ శోభాయాత్రలు, స్వామివారికి విశేష పూజలు, నగరసంకీర్తనలు, దీపోత్సవం జరిగాయి. కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు

రాజానగరం: మండలంలోని రాజానగరం, చక్రద్వారబంధం, రాధేయపాలెం, నరేంద్రపురం, నందరాడు, కలవచర్ల, సీతారాంపురం, పల్లకడియం, కానవరం, రామస్వామిపేట, ఫరిజల్లిపేట తదితర గ్రామాలన్నీ శ్రీరాముని నామ గానామృతాలతో సందడిగా మారాయి. సూర్యాస్తమయం అనంతరం ప్రతి ఇంట దీపాలు వెలిగించారు. ఆలయాల వద్ద భక్తులకు ప్రసాద వితరణలు జరిగాయి. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్త లు పాల్గొన్నారు. కానవరంలోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు శ్రీరామ నామం ఆకృతిలో కూర్చుని శ్రీరామ నామాన్ని జపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మూర్తి, ప్రిన్సిపాల్ దేవిబంగారం, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో గ్రామస్థులందరూ రామనామ స్మరణతో గ్రామంలోని రామాలయాన్నీ దర్శించుకుని దీపారాధన చేసి రామున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే మెళ్లూరు, ఊలపల్లి, పందలపాక, బలభద్రపురం, కొమరిపాలెం గ్రామాల్లో రామాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

రాజమహేంద్రవరంరూరల్/కడియం: షిర్డిసాయి విద్యానికేతన్ విద్యార్థులు రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో అయోధ్య రామమందిరం నమూనా తయారు చేసి దాని ఎదుట సుమారు 500 మంది సీతా, రామ, లక్ష్మణ హనుమ తదితర పాత్రల వేషధారణలతో హనుమాన్ చాలీసా నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దీనికి ఆర్‌జేడీ శారద, ఆర్ఐవో నరసింహం ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. షిర్డిసాయి ఛైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ఆసక్తితోనే ఈ కార్యక్రమం విజయవంతం చేయగలిగామన్నారు. అనంతరం కడియం దేవీచౌక్ సెంటర్‌లో సుమారు 500 మంది విద్యార్థులు సీతా, రామ, లక్ష్మణ హనుమ తదితర పాత్రల వేషధారణలతో హనుమాన్ చాలీసా నృత్యరూపకాన్ని నిర్వహించారు.

కోరుకొండ: మండలంలోని పలు రామాలయాల్లో ఉదయం 6గంటల నుంచి ఏకాహం భజనలు ప్రారంభమయ్యాయి. కోరుకొండ హరేరామ సమాజం వద్ద సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయాలు వద్ద దీపాలు వెలిగించి భజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు, గ్రామపెద్దలు జై శ్రీరాం జెండాలతో గ్రామంలో పాదయాత్ర చేశారు. సాయంత్రం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయనకు అర్చకస్వాములు స్వామివారి శేషమాల, శేషవస్త్రం అందించి ఆశీర్వచనాలు అందించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని ఏవీ అప్పారావు రోడ్డు రామాలయంలో స్వామి వారిని బీజేపీ నాయకులు సోము వీర్రాజు, బొమ్ముల దత్తు, స్థానిక నాయకులు దర్శించుకున్నారు. అనంతరం రామాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎంపీ భరత్ పాల్గొని రథాన్ని లాగారు. ఈ రథయాత్ర నృత్యాలు, డప్పులు వాయిద్యాల నడుమ సాగింది. అనంతరం సుబ్రహ్మణ్య మైదానంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. జనసేన నేత అనుశ్రీ సత్యనారాయణ రామనామాన్ని నినదిస్తూ ర్యాలీ చేశారు. గోపాల్‌నగర్ రామాలయం కమిటీ ఆధ్వర్యాన సీతారాముల ఊరేగింపు జరిగింది. శ్రీ వెంకటేశ్వరా జనరల్ మార్కెట్‌లోని శ్రీవారి దేవాలయంలో అఖండ శ్రీరామనామ సంకీర్తన జరిగింది. దేవీచౌక్ దశావతార రామాలయం, సీతంపేట రామాలయం, కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం, సీతారాముల ఆలయాల్లో భక్తులు సీతారాములను దర్శించుకొన్నారు. 25వ వార్డులో మురళీ కృష్ణ మందిరంలో మహాన్నదానం నిర్వహించారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో నిర్వహించిన శోభాయాత్రలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనపర్తిలోని నల్లకాలువ వద్ద వేంకటేశ్వరాలయం ఆధ్వర్యంలో శోభాయాత్ర, సత్తి పోతారెడ్డి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శేషగిరిరావు పేటలోని సాయిరామ్ మందిరంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

రంగంపేట: రంగంపేట కోదండ రామాలయం, వడిశలేరు రామాలయం, పెదరాయవరం తదిరత గ్రామాల్లో రామాలయ కమిటీలు ఉత్సవమూర్తులను పల్లకిలో పెట్టి, కాషాయ జెండాలను పట్టుకొని, జైశ్రీరామ్ అంటూ నినాదాలు, భజనలు చేస్తూ, బాణా సంచా కాలుస్తూ, శ్రీరామ రక్షలు కుట్టుకున్నారు. ప్రసాద వితరణ చేస్తూ ఊరేగించారు. రంగంపేట శ్రీజ్ఞాన లహరి స్కూల్లో చిన్నారులను సీతారామ లక్ష్మణ సహిత హనుమాన్ వేషధారణలో ప్రత్యేక పూజలు చేయించారు. శ్రీ రామ యూత్ సభ్యులు బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల భజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. సామాజిక బాధ్యత

- వచ్చే నెల 19 వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు
- కలెక్టర్ మాధవీలత.. కరపత్రాలు, పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై పూర్తిగా అవగాహన కలిగి ఉండడం.. రహదారి భద్రతా నిబంధనలను పా టించడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భం గా కరపత్రాలు, పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఫిబ్రవరి 19వరకూ నిర్వహిస్తున్న మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనాలను డ్రైవ్ చేసే సమయంలో ముఖ్యంగా ఆరు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనం నడపడం, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం తాగి వాహనం నడపడం వంటివి చేయరాదన్నారు. హెల్మెట్, సీట్‌బెల్టు ధరించడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ని అనుసరించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మాసోత్సవాలను విజయవం తం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు మాట్లాడుతూ వాహన చోదకులకు కచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. రవాణా శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలను అతిక్రమిస్తే అపరాధ రుసుం విధిస్తారని హెచ్చరించారు. రహదారి భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరశింహులు, పర్యాటక శాఖ ఆర్డీ స్వామి నాయుడు, ఎంవీఐలు సంపత్‌కుమార్, నాయక్, రామ్‌నారాయణ్, ఏఎంవీ ఐలు సబిత, రాధిక, జమీర్ తదితరులు పాల్గొన్నారు.


చిరుధాన్యాలతో తయారు చేసే వంటల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిరుధాన్యాలతో విలువైన పోషకాలు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 22: చిరుధాన్యాల ద్వారా ఎంతో విలువైన పోషక విలువలు గల ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ మాధవీలత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆసోషియేషన్ డైరీని, చిరుధాన్యాలతో 100 పిండి వంటల పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. 2023వ సంవత్సరాన్ని ఐక్య రాజ్య సమితి చిరుదాన్యాల పంటగా ప్రకటించి ఆమేరకు మిల్లెట్స్ సాగు విస్తీర్ణ పెంచడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ తప్పని సరిగా వారు తీసుకొనే ఆహారపు అలవాట్లలో చిరుధాన్యాలు వినియోగించాలన్నారు. చిరుధాన్యాలు ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ తేజ్‌భరత్, డీఆర్వో నరశింహులు, వ్యవసాయ శాఖ ఆసోసియేషన్ ప్రతినిధులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

కోడికత్తి శ్రీనును విడుదల చేయాలంటూ నిరసన

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 22: కోడికత్తి శ్రీనుని జగన్ ప్రభుత్వం అన్యాయంగా రిమాండ్‌లో ఉంచి ఇబ్బందులు పెడుతోందని రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు మత్యేటి ప్రసాద్ తెలిపారు. శ్రీనును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బొమ్మూరు అరుంధతి పేటలో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగజ్జీవనరామ్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాన్ని తలపెట్టారు. టీడీపీ-బీమరశెట్టి రమేష్, జనసేన-యార్లగడ్డ సునీల్, ఎస్సీసెల్ నాయకులు పెనుముచ్చి సురేష్, రాయుడు సునీల్, అనంతారపు గోపి పూలమాలలు వేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్పీఎఫ్‌కు ప్రథమస్థానం

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాజమహేంద్రవరం జోన్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) క్రీడాకారులు వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఏపీ ఎస్‌పీఎఫ్ దళాధిపతి డా.సీఎం త్రివిక్రమవర్మ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. ఈ సందర్భంగా ట్రోఫీ సాధించిన సిబ్బందిని జోన్ కమాండెంట్ డా.కొండా నరసింహారావు సోమవారం అభినందించారు.

కండువాలు కప్పే సంస్కృతి టీడీపీది కాదు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 22: కండువాలు కప్పే సంస్కృతిక టీడీపీకి ఏనాడులేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్‌రోడ్డు టీడీపీ కార్యాలయంలో ఆదిరెడ్డి వాసును గ్రామీణ వైద్యులు (బీఎంపీ, పీఎంపీ) కలిసి తమ సమస్యలు పరిష్కారానికి సహకరించాలని కోరారు. దీనికి ఆయన స్పందించారు. గ్రామీణ వైద్యులను గుర్తించింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అనేక మార్లు గ్రామీణ వైద్యులను బస్సుల్లో తీసుకెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లను కలిసి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని భరోసా ఇచ్చినట్టు గుర్తుచేశారు. చంద్రబాబు సీఎంగా గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారం సిద్ధమౌతున్న సమయంలో ప్రభుత్వం మారడంతో వారికి జగన్ సర్కార్ అన్యాయం చేసిందన్నారు.

అంగన్వాడీల అరెస్టుకు ప్రజా సంఘాల నిరసన

రేపు రాష్ట్ర బంద్‌కు పిలుపు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 22: అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో నిరవధిక దీక్ష చేస్తున్న రాష్ట్ర న్యాయకత్వంపై అమానుషదాడి చేసి దీక్ష భగ్నం చేయడంతో పాటు అక్రమంగా అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరలో ప్రజా సంఘాలు ధర్నా చేశాయి. శ్యామలా సెంటర్‌లో జరిగిన ధర్నాలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల నేతలు ఎస్ఎస్ మూర్తి, నల్లా రామారావు, కె.జోజి మాట్లాడారు. తెలంగాణ కంటే అదనంగా జీతాలు పెంచుతామని హామీలు ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక మోసం చేశారని, హామీలనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమరస్ఫూర్వకంగా నిరసన చేస్తుంటే స్పందిచకపోగా అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. వారిపై కక్ష సాధింపు చర్యలు మానుకుని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు, దాడులను నిరసిస్తూ ఈనెల 24న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు జేఏసీ పిలుపునిచ్చిందని ప్రజలు ప్రజాసంఘాలు మద్దతుగా నిలిచి బంద్‌ను విజయంవతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కేఎస్‌వీ రామచంద్రరావు, కర్రి రామకృష్ణ, టి.సావిత్రి, సోమేశ్వరావు, పి.తులసి, ఐ.సుబ్రహ్మణ్యం, పోలిన వెంకటేశ్వరావు, ఏఐటీయూసీ నాయకులు సప్పా రమణ, జీఏ రామారావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు అపారావు పాల్గొన్నారు.

అనపర్తిలో అంగన్‌వాడీల అరెస్టు

అనపర్తి, జనవరి 22: చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా అన పర్తిలో పోలీసులు 22మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్టేషన్ లోనే ఉంచారు. సాయంత్రం సొంత పూచీకత్తులపై విడిచిపెట్టారు. ఈ సంద ర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న తమను పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించడం దారుణమన్నారు.

పరిపాలన గాలికి వదిలి అసెంబ్లీ సీట్లపై దృష్టి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వజన

రాజమహేంద్రవరం అర్బన్ జనవరి 22: రాష్ట్రంలో సీఎం జగన్ పరిపాలన గాలికి వదిలేసిన అసెంబ్లీ సీట్లు పై దృష్టిపెట్టారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వజన విమర్శించారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ జాతీయ సమితి సమావేశం చింతలపూడి సునీల్ అధ్యక్షతన జరిగింది. దీనికి వనజ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రం అప్పులు ఊబిలో కూరుకుపోయిందని, సమస్యల అన్నింటిని పూర్తిగా వదిలేసారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎమ్మెల్యేలు బదిలీలు పార్టీ కార్యక్రమాలకే జగన్ పరిమితమయ్యారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో పొత్తులపై తాము ముందుగా టీడీపీతో కలిసి వెళ్లాలని భావించామని అయితే టీడీపీ జనసేనలు బీజేపీలతో పయనించడానికి సిద్ధమవుతున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో తమ పార్టీ వుందన్నారు. అలాగే ఏపి పొత్తులపై టీడీపీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు ఇతర వర్గాల ప్రజలు రోడ్డు మీదకు వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేయ్యడం సియంకు సిగ్గుచేటన్నారు. అదేవిధంగా విశాఖపట్నం పరిపాలన రాజధాని పేరుతో రుషికొండకుగుండు కొట్టించాడని రూ451 కోట్లతో విశాలమైన భవంతిని నిర్మించుకున్న జగన్ రాష్ట్రంలో అంగన్వాడి వర్కర్ల కు మునిసిపల్ కార్మికులకు కనీస గౌరవ వేతనం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులను సకాలంలో పంపిణీ చేయండి

జేఏఎస్ రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ గ్లోరి

రాజానగరం, జనవరి 22: ప్రభుత్వం నుంచి విడుదలైన జగనన్న ఆరోగ్య సురక్షా కార్డులను ప్రజలందరికీ సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని జగనన్న ఆరోగ్య సురక్షా రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ గ్లోరి వైద్యాధికారులకు సూచించారు. రాజానగరం పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి సూచనలు, స హాలు అందించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ తీరు, కార్డుల వినియోగం, ఆరోగ్యశ్రీతో కల్పించే వైద్య సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏంజెల్, సూపర్‌వైజర్ ఎస్వీవీపీ రమణ, ఏఎన్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులైన స్థానిక 15వ వార్డుకు చెందిన వద్దాది ఇంద్ర(బాల దుర్గాప్రసాద్)వారి మిత్రబృందం సోమవారం జనసేనలో చేశారు. సిటీ జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు, జనసేన నాయకుడు వై.శ్రీనివాస్, గుర్తులు సత్యనారాయణ, దాసరి గురునాథరావు, పైడి రాజు, షేక్ లిమ్రా పాల్గొన్నారు.

రేపటి నుంచి నన్నయలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా

రాజానగరం, జనవరి 22: ఆడుదాం అంధ్రా రాజానగరం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సైంధవ్
సూర్యామినీ	: నా సామి రంగ
సూర్యాప్యాలస్	: గుంటూరు కారం
స్వామి	: గుంటూరు కారం
శివజ్యోతి	: నా సామి రంగ
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	: సలార్
ఊర్వశి	: హనుమాన్
రంభ	: నా సామి రంగ
మేనక	: హనుమాన్
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: హనుమాన్
వీఎస్ మహల్(నామవరం)	: హనుమాన్, నాసామిరంగ
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: నా సామి రంగ
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: గుంటూరు కారం
సూర్యశ్రీ (అనపర్తి)	: గుంటూరు కారం
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గుంటూరు కారం
రామకృష్ణ(కోరుకొండ)	: సైంధవ్
గీతాసినిమాస్ (సీతానగరం)	: సైంధవ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: గుంటూరు కారం
లలితామహల్(రంపచోడవరం)	: హనుమాన్, నాసామిరంగ
నవయుగ(చింతూరు)	: హనుమాన్



అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థుల హనుమాన్ చాలీసా నృత్య రూపకం

జిల్లా ఓటర్లు 16,05,762



ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ తదితరులు

- పురుషులు7,85,142 » మహిళలు 8,20,515 » థర్డ్ జెండర్ 105
- జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 35, 373 మంది అధికం
- రాజమహేంద్రవరం రూరల్‌లో అత్యధికంగా 2,71,159 మంది ఓటర్లు
- కొవ్వూరులో అతి తక్కువగా 1, 83,405 మంది ఓటర్లు
- ఎస్ఎస్ఆర్-2024 ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన కలెక్టర్ మాధవీలత

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. 2024 ఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 16,05,762 మంది. అందులో పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105 మంది ఉన్నారు. జిల్లాలో పురుషులకంటే మహిళలే ఓటర్లు అధికంగా నమోదయ్యారు. పురుషులకంటే మహిళలు 35,373 మంది ఎక్కువగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలే ఎక్కువ ఉన్నారు. ఇక జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్ నమోదైంది. అక్కడ2,71159 మంది ఓటర్లున్నారు. అందులో మహిళలు 1,38,604 మంది ఉండగా, పురుషులు 1,32,531 మంది ఉన్నారు. థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,83,405 మంది, పురుషులు 89, 442 మంది, మహిళలు 93,958 మంది, థర్డ్ జెండర్ అయిదుగురు ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఓటర్ల సంఖ్యపరంగా రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 2,60360 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 1,34,663 మంది ఉండగా, పురుషులు 1,25,639 మంది ఉన్నారు. థర్డ్ జండర్లు 58 మంది ఉన్నారు. గోపాలపురం నియోజకవర్గం ఓటర్లపరంగా మూడో స్థానం ఉంది. ఇక్కడ 2,41,798 మంది ఉండగా, పురుషులు 1,18,783 మంది, మహిళలు 1,23,008 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఏడుగురు ఉన్నారు. అనపర్తి నాల్గో స్థానంలో ఉంది. ఇక్కడ 2,23,255మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 109323 మంది, మహిళలు 113930 మంది, థర్డ్ జెండర్ ఇద్దరు ఉన్నారు. రాజానగరం ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 260360 మంది. అందులో పురుషులు 105824మంది, మహిళలు 108083 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ నలుగురు ఉన్నారు. నిడదవోలుది ఆరో స్థానం. ఇక్కడ మొత్తం 211874మంది ఓటర్లుండగా, అందులో పురుషులు 103600 మంది, మహిళలు 108269 మంది. కొవ్వూరుది అతి తక్కువ ఓటర్లతో చివరి స్థానం. కాగా ఇంకా ఎవరైనా ఓటు నమోదుకు అర్హులైనవారు ఉంటే, ఈసీఐ ఎన్నికల షెడ్యూల్ జారీచేసినా కూడా నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు వరకూ ఓటు హక్కు పొందవచ్చని కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలిపారు. అభ్యంతరాలు, సవరణల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

● 661 మంది సర్వీసు ఓటర్లు

జిల్లాలో ఎస్ఎస్ఆర్ -2024 తుది జాబితా ప్రకారం 661 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. అనపర్తి నియోజకవర్గంలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 45 మంది ఉన్నారు. రాజానగరంలో 64 మంది ఉన్నారు. అందులో స్పౌజ్ కూడా ఉన్నారు. మొత్తం 65 మంది ఉన్నారు. రాజమహేంద్రవరం సిటీలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 101, స్పౌజెస్ 13తో కలసి మొత్తం 114 మంది ఉన్నారు. ఇక్కడ ఫారన్ సర్వీసు ఓటరు ఒకరు ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 97, స్పౌజెస్ 12 మొత్తం 109 మంది, ఫారన్ సర్వీసు ఓటరు ఒకరు, స్పౌజ్ ఒకరు ఉన్నారు. కొవ్వూరు ఎస్సి నియోజకవర్గంలో డిఫెన్స్ ఓటర్లు 109, స్పౌజ్ 2 కలిపి మొత్తం 111మంది ఉన్నారు. నిడదవోలులో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 152 మంది, స్పౌజ్ ఏడు కలిపి మొత్తం 159 మంది ఉన్నారు. గోపాలపురం ఎస్సి నియోజకవర్గంలో డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 83, స్పౌజ్ రెండు కలిపి మొత్తం 85 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం డిఫెన్స్ సర్వీసు ఓటర్లు 651 మంది, స్పౌజెస్ 37 మంది కలిపి మొత్తం 688 మంది ఉన్నారు. ఫారన్ సర్వీసు ఓటర్లు ఇద్దరు, స్పౌజ్ ఒకరు కలిపి మొత్తం ముగ్గురు ఉన్నారు. డిఫెన్స్, ఫారన్ సర్వీసు ఓటర్లు మొత్తం కలిపి 691 మంది ఉన్నారు.

● 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఓటర్లు

అక్టోబరులో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి 18 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న కొత్త ఓటర్లు 11,512 మంది చేరగా, తుది జాబితా నాటికి 37,200 మంది పెరిగారు. స్పెషల్ డ్రైవ్, కాలేజీల వంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌తో నమోదు వల్ల ఈ సంఖ్య పెరిగిందని కలెక్టర్ తెలిపారు.

● శాశ్వత వలస, మరణించిన 116 ఓటర్ల తొలగింపు

గతేడాది అక్టోబరు 27న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన నాటి నుంచి ఇప్పటివరకూ జిల్లాలో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న 1196 ఇళ్లను గుర్తించారు. అందులో 14,791 మంది ఓటర్లున్నారు. వాటిని విచారణ జరిపి ఫారమ్-8 ద్వారా 5588 మంది ఓటర్ల చిరునామా మార్పు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. శాశ్వతంగా వలస వెళ్లిపోయివారు, మరణించిన వారు 116 మంది ఓటర్లు ఉండగా ఫారమ్- 7 ద్వారా వారిని తొలగించినట్టు కలెక్టర్ తెలిపారు. జంక్ క్యారెక్టర్ కలిగిన 12 ఇళ్లు గుర్తించారు. అందులో 14మంది ఓటర్లు ఉన్నారు. వాటికి ఫారమ్-8 ద్వారా దరఖాస్తు చేయించారు. ఒకే రివిజన్‌లో రెండు దరఖాస్తులు పెట్టిన కారణంగా ఈ 14 ఫారమ్- 8లు ఈ-రోల్‌లో అప్‌డేట్ కాలేదు. రివిజన్ పూర్తిచేసిన తర్వాత అప్‌డేట్ చేస్తామని కలెక్టర్ తెలియజేశారు.

● హోం ఓటింగ్ సౌకర్యం

జిల్లాలో 18,722 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు, 80 ఏళ్ల దాటిన ఓటర్లు 28,386 మంది ఉన్నారు. 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నవారికి, 80 ఏళ్ల దాటిన వారికి వచ్చే ఎన్నికల్లో హోంఓటింగ్ సౌకర్యం ఉందని, దీనికి ఫారమ్-12డి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నియోజకవర్గం- పేరు	పురుషులు 2024	పురుషులు 2023	మహిళ 2024	మహిళ 2023	థర్డ్ జెండర్ 2024	థర్డ్ జెండర్ 2023	మొత్తం 2024	మొత్తం 2023
40. అనపర్తి	109323	106168	113930	109558	2	0	223255	215726
49. రాజానగరం	105824	102239	108083	104187	4	9	213911	213911
50. రాజమహేంద్రవరం సిటీ	125639	123533	134663	131716	58	62	260360	255311
51. రాజమహేంవరం రూరల్	132531	125942	138604	131469	24	16	271159	257427
54, కొవ్వూరు	89442	86463	93,958	90855	5	9	183405	177327
55. నిడదవోలు	103600	101213	108269	104964	5	8	211874	206185
66. గోపాలపురం	118783	115468	123008	118379	7	10	241798	233857
మొత్తం	7,85,142	761026	8,20,515	791128	105	114	1,60,5762	1552268





రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో పోలీసుల నిర్బంధంలో అంగన్వాడీలు.. రైల్వే స్టేషన్‌లో నిర్బంధం

అడుగడుగునా నిర్బంధం

- 'ఛలో విజవాయవాడ'కు వెళ్లకుండా వెయ్యి మందికిపైగా అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు
- ముందస్తు అరెస్టుల సంఖ్యపై గోప్యత » అర్ధరాత్రి ప్రభుత్వంతో ఫలించిన చర్చలు.. సమ్మె విరమణ

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు 'ఛలో విజయవాడ' రాష్ట్రస్థాయి నిరసనకు విజయవాడ వెళ్లకుండా జిల్లావ్యాప్తంగా పోలీసులు ఉక్కుపాదం మోపారు. తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన పోలీసులు ఎక్కడికక్కడ అంగన్వాడీలను అడ్డుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కల్యాణమండపాలకు తరలించి నిర్బంధించారు. అంగన్వాడీలు ఎవరూ బయటకు వెళ్లకుండా పోలీసులు కాపలాగా ఉన్నారు. వారిని నిర్బంధించిన కల్యాణమండపాలు తదితర భవనాల గేట్లకు తాళాలు వేశారు. ఇళ్లకు వెళ్లకుండా విజయవాడ వెళ్లాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించి సాయంత్రం వేళ సొంత పూచీకత్తుపై పంపించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు ఏజెన్సీ ప్రాంతానికి కూడా రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ గేట్‌వే వంటిది. దీంతో తెల్లవారుజాము నుంచే రాజమహేంద్రవరం రైల్వేస్టేషను వద్ద టూటౌన్, ప్రభుత్వ రైల్వే పోలీస్, రైల్వే భద్రతా దళం సిబ్బంది మోహరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రకాశం నగర్ పోలీసులు గస్తీ నిర్వహించారు. రైళ్లల్లో, బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్న మహిళలను ప్రశ్నించారు. అంగన్వాడీలని నిర్ధారణ అయితే వెంటనే వాహనాల నుంచి దించేశారు. వాళ్లందరినీ కల్యాణ మండపాలు తదితర చోట్లకు తీసుకెళ్లారు. రైల్వే స్టేషనులో ఉదయం విజయవాడ ప్యాసింజర్, షిర్డి ఎక్స్‌ప్రెస్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వెళ్లే వరకూ అంగన్వాడీల కోసం వెతుకులాడుతూనే ఉన్నారు. రాజమహేంద్రవరం టూటౌన్, ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వందమందికిపైగా అంగన్వాడీలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ధవళేశ్వరం 11, కడియంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో ఈ సంఖ్య వెయ్యి దాటిందని తెలుస్తోంది. అంతే కాకుండా ఎన్‌టీజీ కృష్ణా జిల్లా, విశాఖ, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన సుమారు 400 మందిని విజయవాడ తదితర ప్రాంతాల నుంచి బస్సుల్లో తీసుకొచ్చి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, దేవరపల్లి ప్రాంతాల్లోని ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్బంధించారు. సాయంత్రం వరకూ నిర్బంధం వదిలేశారు. కాగా చిన్న ఉద్యోగులమైన తాము 42 రోజుల నుంచీ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎన్నో ఇబ్బందులను ఓర్చుకుంటూ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని.. మహిళలని కూడా చూడకుండా తమను ముద్దాయిల మాదిరిగా అరెస్టులు చేసి నిర్బంధించడమేంటని అంగన్వాడీలు ప్రశ్నిస్తున్నారు. తమవల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం లేకపోయినా ప్రభుత్వం తీరు దారుణంగా ఉందని, మహిళలను అడ్డుకోవడానికి పోలీసులను ప్రభుత్వం వినియోగించుకోవడం బాధాకరమంటూ ఆవేదన చెందారు. అంగన్వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.

అంగన్‌వాడీలను టెర్మినేట్ చేస్తాం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విధుల్లో చేరని అంగన్వవాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామని, ఇప్పటికే సంబంధిత పత్రాలుపై సంతకాలు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1556 అంగన్వాడీ కేంద్రాల్లో 1538 వర్కర్లు 1493 మంది సహాయకులు ఉన్నారన్నారు. సమ్మె తర్వాత ఇప్పటివరకూ 164 మంది వర్కర్లు, 162 మంది హెల్పర్లు విధుల్లో చేరారన్నారు. ఇంకా ఎవరైనా చేరేవారుంటే మంగళవారం కూడా విధులకు హాజరు కావచ్చని తెలిపారు. మెటర్నిటీ కారణాలతో 9 మంది వర్కర్లు, 16 మంది హెల్పర్లు సెలవులో ఉన్నారని ఆమె చెప్పారు.

సమ్మె విరమణ

అంగన్‌వాడీ సంఘాలతో ప్రభుత్వం సోమవారం అర్ధరాత్రి జరిపిన చర్చలు ఫలించాయి. దాంతో తమ సమ్మె విరమిస్తున్నట్టు అంగన్‌వాడీలు ప్రకటించారు.





దేవరపల్లిలో అంగన్వాడీలకు భోజనాలు వడ్డిస్తున్న పోలీసులు .. అంగన్వాడీలతో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రాజు

విజయవాడ నుంచి తెచ్చి.. దేవరపల్లి ఫంక్షన్ హాలులో నిర్బంధం

- సాయంత్రం వరకు రాష్ట్రమంతా తిప్పి ఇక్కడ వదిలేశారు » పరామర్శించిన మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, జనవరి22: అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలపడానికి ఛలో విజయవాడ వెళ్తుంటే ప్రభుత్వం కర్కశంగా పోలీసులతో భౌతికదాడులు చేసి బస్సులు ఎక్కించారని వివిధ జిల్లాలకు చెందిన అంగన్వాడీ మహిళలు విమర్శించారు. దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్‌హాలుకు విజయవాడ నుంచి మూడు బస్సుల్లో ఎన్‌టీఆర్ జిల్లా, గుంటూరు, తూర్పుగోదావరి, కాకినాడ, ఏలూరు, విజయనగరంతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మూడు బస్సుల్లో సుమారు 400 మందిని తరలించారు. అంగన్వాడీ మహిళలు ఆదిలక్ష్మి, భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ విజయవాడ బస్టాండ్ల వద్ద తమను పోలీసులతో బలవంతంగా బస్సులో ఎక్కించారని, మహిళా పోలీసులే కాకుండా, పురుష పోలీసులు కూడా రెక్కలతో ఈడ్చుకొచ్చి బస్సుల్లోకి ఉదయం 10 గంటలకు ఎక్కించి విజయవాడ నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తిప్పితిప్పి దేవరపల్లి నాలుగు గంటలకు తీసుకొచ్చారని, కనీసం మంచినీరు తాగుదామన్నా బస్సు ఎక్కడా నిలుపుదల చేయలేదని ఆరోపించారు. నాలుగు గంటలకు దేవరపల్లిలో కల్యాణ మండపం వద్ద పోలీసులు భోజనాలు ఏర్పాటు చేశారని, అక్కడ వదిలి మీ ప్రాంతాలకు వెళ్లిపోవాలని పోలీసులు కోరారని చెప్పారు. తమ ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వం పతనంకావడం ఖాయమని, తమ న్యాయమైన కోర్కెలు తీర్చకపోతే సమ్మె విరమించబోమని హెచ్చరించారు. తమను ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే వదిలివేయాలని ఆందోళనకారులు పట్టుబట్టడంతో దేవరపల్లి సీఐ రామ కృష్ణ, ఎస్ఐ శ్రీహరిరావు, ట్రైనీ డీఎస్పీ భానోదయ, అంగ న్వాడీలతో చర్చలు జరిపి ఎవరి ప్రాంతాలకు వారు వెళ్లా లని సూచించారు. కాగా సాయంత్రం వీరికి మద్దతుగా రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట్రాజు సంఘీభావం తెలిపారు. మద్దిపాటి మాట్లాడుతూ 42 రోజులుగా తమ న్యాయమైన కోర్కెల కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. పోలీసులను ఉసిగొలిపి అంగన్వాడీలను చిత్ర హింసలకు గురిచేశారని, ఇది దారుణమని ఆయన పేర్కొన్నారు.



గోపాలపురం ఫంక్షన్‌హాలు వద్ద నుంచి అంగన్వాడీలను ఇంటికి పంపుతున్న ఎస్ఐ కే.సతీష్‌కుమార్

గోపాలపురంలోనూ నిర్బంధం

గోపాలపురం, జనవరి 22: అంగన్వాడీలు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు విజయవాడ సమీపంలో 60 మంది అంగన్వాడీలను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 46 మంది అంగన్వాడీ కార్యకర్తలు, మరో 14 మంది ఆయాలు ఉన్నారు. మార్గమధ్యంలో అడ్డుకున్న అంగన్వాడీలను ప్రత్యేక బస్సులో ఎక్కించి గోపాలపురం గ్రామశివారులో ఉన్న కేఎస్ రెడ్డి ఫంక్షన్‌హాలుకు పోలీసులు తరలించి మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేసిన అనంతరం అంగన్వాడీలను ఇంటికి పంపారు. కాగా అంగన్వాడీలు ఛలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకునే క్రమంలో 21 మంది అంగన్వాడీలకు ముందస్తు నోటీసులు ఇచ్చి ఐదుగురిపై ప్రత్యేక నిఘా పెట్టారు.

(అనపర్తి)

కొప్పవరం సంబరం

సత్తెమ్మ తల్లి కొంగు బంగారం







ధనిక, పేద, కులం, మతం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నీ మొక్కులు చెల్లించడానికి వచ్చాం..కరుణించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. కొంగు బంగారమైన సత్తెమ్మ తల్లి మొక్కులు తీర్చుకున్నారు. అనపర్తి మండలం కొప్పవరంలోని కర్రి వారి సత్తెమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. మూడు రోజులు జరిగే ఈ సంబరం సోమవారం జరిగిన జాతరతో ముగిసింది.



పండుగకి 200 ఏళ్ల చరిత్ర

సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి ఆవిర్భావంపై ఇక్కడ ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రితం ఊతకోటకు చెందిన ఐదుగురు సభ్యులు గల కర్రి వారి వంశీయులు గ్రామంలో పనులు లేక ఏమి చేయాలో పాలుపోని పరిస్థితిలో గోదావరి పాయకు చేరుకుని విచార వదనంలో బాధపడుతుండగా అక్కడకు ఒక పాప వచ్చి వారి కష్టాన్ని అడిగి తెలుసుకుంది. బతికేందుకు మంచి ప్రాంతాన్ని చూపుతానని తనతో రావాలంటూ అనపర్తి మండలం కొప్పవరం గ్రామం తీసుకువచ్చి ఇక్కడ మీరు బతికేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సుఖసంతోషాలతో జీవించాలని చెప్పి అంతర్ధానమైంది. దీంతో వారంతా తమకు దారి చూపేందుకు సత్తెమ్మ తల్లి బాలిక రూపంలో వచ్చిందని నమ్ముతూ ఆమెను అమ్మరూపంగా ఆరాధించడం ప్రారంభించారు. ఇలా జరుగుతుండగా కొప్పవరం చేరుకున్న కర్రి వంశీయులు ఇక్కడ వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ఇలా వారంతా సంతోషంగా బతుకుతున్న తరుణంలో కళ్ళాల్లో ధాన్యం దొంగలపాలవడం ప్రారంభమైంది. ఒక రోజు అమ్మవారు భక్తుడి కలలోకి వచ్చి పంటను దొంగలు దోచుకుంటున్నారని తాను నాగదేవత రూపంలో కళ్ళం వద్ద ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లిన రైతు దొంగలను చూసి ఆశ్చర్య పోయాడు. రైతును చూసిన దొంగలు పరారయ్యారు. నాగ దేవత రూపంలో ఉన్న అమ్మవారు సమీపంలో ఉన్న పాముల పుట్టలోకి వెళ్లి అంతర్ధానమయ్యారు. దీంతో కర్రి వారి వంశీయులు ప్రతి రెండేళ్లకు ఒకసారి జాతరలో నాగదేవతను పూజించడం ఆచారంగా వస్తోంది.



3 రోజుల సంబరం

వివిధ వేషధారణల్లో భిక్షాటన చేస్తున్న భక్తులు

మొదటి రోజు మిద్దెపై ఉన్న కత్తిరి కుండను కిందకు దింపడంతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దింపిన కుండకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు నిర్వహించిన కుండను సంతానం లేని వారు శిరస్సుపై ధరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. రెండో రోజు పుట్ట వద్దకు వేషాలు ధరించి వెళ్లిన భక్తులు అమ్మకు పాలు పోసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని భక్తులు ఆలయ పూజారులతో బడిత పూజ చేయించుకుంటారు. ఇలా చేస్తే వచ్చే రెండేళ్ల పాటు అమ్మ కాపాడుతుందని భక్తుల నమ్మకం.

ఆఖరి రోజున భిక్షాటన జాతర

ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఏదో ఒక విచిత్ర వేషం ధరించి జాతరలో భిక్షాటన చేయాలి. అలా భిక్షం తీసుకోగా వచ్చిన కానుకలను మాత్రమే అమ్మ స్వీకరిస్తుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సోమవారం జరిగిన జాతరలో భక్తులు అనేక వేషాలు ధరించి భిక్షాటన చేశారు. మోతుబరి నుంచి కూలీ వరకు, విద్యాధికుడి నుంచి నిరక్షరాస్యుడి వరకు కుల, మత, జాతి, ధనిక, పేద తారతమ్యం లేకుండా వేషాలు ధరించి భిక్షాటన చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సినిమాలో పాత్రలను వేషాలుగా ధరించిన వ్యక్తులు డైలాగులు వల్లిస్తూ అలరించారు. సాధారణంగా జాతరలు రాత్రి పూట నిర్వహిస్తారు. కానీ ఇక్కడ పగటి పూట నిర్వహించడం విశేషం. సత్తెమ్మ తల్లిని సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, తనయుడు మనోజ్‌రెడ్డి, తెలుగు మహిళలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు.









భిక్షాటన జాతరలో వేషధారణలు

రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా భావించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై పూర్తిగా అవగాహన కలిగి ఉండడం.. రహదారి భద్రతా నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని కరపత్రాలు, పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 19 వరకూ నిర్వహిస్తున్న మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనాలను డ్రైవ్ చేసే సమయంలో ముఖ్యంగా ఆరు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు జేసీ ఎస్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరశింహులు, పర్యాటక శాఖ ఆర్డీ స్వామినాయుడు, ఎంవీఐలు సంపత్‌కుమార్, నాయక్, రామ్‌నారాయణ్, ఏఎంవీఐలు సబిత, రాధిక, జమీర్‌లు పాల్గొన్నారు.

కొవ్వూరు నియోజకవర్గ ఓటర్లు 1,83,405 మంది

మహిళలు-93958, పురుషులు-89442, ఇతరులు ఐదుగురు



తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జనవరి 22: కొవ్వూరు నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ప్రచురించారు. సోమవారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 1,83,405 మంది ఓటర్లతో నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో 1,83,405 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో మహిళలు 93958, పురుషులు 89442 మంది, ఇతరులు 5గురు ఉన్నారన్నారు. కొవ్వూరు పట్టణంలో 34160, కొవ్వూరు మండలంలో 55207, చాగల్లు మండలంలో 52259, తాళ్లపూడి మండలంలో 41779 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తుది ఓటర్ల జాబితాను నియోజకవర్గంలోని పట్టణ, మూడు మండలాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రచరించినట్టు చెప్పారు. ఓటర్లు తమ ఓటును సరిచూసుకోవాలన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులకు సబ్ కలెక్టర్ కృతజ్ఞతలు

కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరోగ్యకరమైన తుది ఓటర్ల జాబితా తయారీలో కృషి చేసిన పోషించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ కృతజ్ఞతలు తెలిపారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ ఓటర్ల తుది జాబితా ప్రచురించామని, గ్రామ, వార్డు సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, ప్రతి ఒక్కరు ఓటును పరిశీలించుకోవాలన్నారు. క్రొత్తగా ఓటర్లుగా నమోదు కాని వారు ఎవరయినా ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తప్పులుంటే ఆన్‌లైనులో ధరఖాస్తు చేసుకుని మార్చుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, పొట్రు శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు జేవీఎస్ఎం కుమార్, గంధం బాబ్జి, తహశీల్దార్లు బి.నాగరాజ్‌నాయక్, రాధిక, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

'స్పందన'కు 21 ఫిర్యాదులు

కొవ్వూరు, జనవరి 22: స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజి తెలిపారు. సోమవారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి స్పందన నిర్వహించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు పంపించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

కొవ్వూరు, జనవరి 22: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనల ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవలిసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. సోమవారం కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని పార్టీ కార్యాలయం వద్ద జనసేన, టీడీపీ ప్రచార డప్పును మోగించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీల అభ్యర్థులకు విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో అచ్యుతరాయుడు, జనసైనికులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితం

తూరలు ఏర్పాటు చేయాలంటూ చీపురుగూడెంలో రాస్తారోకో



చీపురుగూడెంలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

నల్లజర్ల, జనవరి 22: మండలంలోని చీపురుగూడెంలో పుంతలో ముసలమ్మ గుడి వద్ద కొయ్యలగూడెం-నల్లజర్ల ప్రధాన రహదారిలో బ్రిటీష్ కాలం నాటి తూరలను తిరిగి ఏర్పాటు చేయాలని చీపురుగూడెం గ్రామస్థులు సోమవారం గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తాగునీరు పైపు లీకేజీ వల్ల డ్రైనేజీ వాటర్ తాగునీటిలో కలుషితమవుతుందని, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తూరలు ఏర్పాటు చేసేందుకు సిద్ధం కాగ కొంత మంది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారని విమర్శించారు. గ్రామంలో 10మంది వార్డు సభ్యులు ఉండగా 8మంది తూరలు ఏర్పాటు చేయాలని తీర్మాణం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. గంటసేపు రాస్తారోకో చేయడంతో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ టీవీ సురేష్ ఆందోళన కారులతో మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తోరోకో విరమించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జాలాది రవికుమార్, చెల్లు శిరీషా, తలంశెట్టి నాగప్రసాద్, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు వీరవెంకట్రావు, పెద్దరామన్న, మోదుగ సుబ్బారావు, చెల్లు రాంబాబు, వంట్ల పెదరామన్న పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణ హత్య

మెడపై కత్తితో దాడి చేసి పరారైన యువకుడు





హత్యకు గురైన సింహాద్రి సుజాత, ఫైల్‌ఫొటో

చాగల్లు, జనవరి 22: మండలంలోని చంద్రవరం గ్రామంలో ఓ మహిళ సోమవారం దారుణ హత్యకు గురైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత(48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింటు వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్యకుమార్ కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. సోమవారం ఇంటి డాబాపై సుజాత బట్టలు ఆరవేస్తున్న సమయంలో కత్తితో మెడపై బలంగా దాడి చేశాడు. అనంతరం డాబా పైనుంచి హడావిడిగా పారిపోతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైపీ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా సుజాతను హత్య చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం



కొవ్వూరు, జనవరి 22: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాదీనం చేసుకున్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి నుంచి యానాంకు లారీలో మూటలు కట్టి తరలిస్తున్న సుమారుగా 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని, బియ్యాన్ని కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ వి.జగదీశ్వరరావు, తహశీల్దార్ బి.నాగరాజు నాయక్, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ జి.బాపిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హోసన్నా మందిర్ వార్షికోత్సవం

నల్లజర్ల, జనవరి 22: విశ్వాసులు ఆత్మీయతతో నింపబడాలని విజయవాడకు చెందిన హోసన్నా మందిర్ పాస్టర్ రమేష్ అన్నారు. నల్లజర్లలో హోసన్నా మందిర్ మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సమాజంలో అశాంతి నెలకొందని, ప్రతిఒక్కరు తమ నడతలను జాగ్రత్తగా ప్రభువులో కాపాడుకోవాలన్నారు. అందరిని ప్రేమించాలని, ద్వేషం, అసూయ విడనాడాలన్నారు.

అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం

» మీడియా ప్రతినిధులపై డీసీపీ విశాల్‌గున్నీ తీరు బాధాకరం

» పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ

కొవ్వూరు, జనవరి 22: అర్ధరాత్రి అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను అరెస్టు చేయడం చట్ట విరుద్ధం, అప్రజాస్వామికమని, వారిని తక్షణం విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. కనీస వేతనం, గ్రాట్యూటీ అమలు చేయాలని 42 రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను అణచివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న శిబిరంపై పోలీసులు దౌర్జన్యం చేసి, దుర్మార్గంగా మహిళలను ఈడ్చుకెళ్లడాన్ని తప్పుబట్టారు. ధర్నా చౌక్ వద్ద తెల్లవారుజామున 3గంటల సమయంలో పోలీసులు మోహరించి, లైట్లు ఆర్పి అంగన్వాడీలను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ దుర్ఘటనపై మానవ హక్కుల కమిషన్, హైకోర్టు జోక్యం చేసుకుని విచారణ జరిపి పౌరహక్కులను ఉల్లంఘించిన అధికారులు, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫొటోలు తీస్తున్న మీడియా ప్రతినిధులపై డీసీపీ విశాల్ గున్ని ఆగ్రహం వ్యక్తం చేయడం, ఫొటోగ్రాఫర్‌లను బస్ ఎక్కించి, అనంతరం దింపివేయడం బాధాకరమన్నారు. ఇదిలా ఉండగా విజయవాడలో అంగన్వాడీల దీక్షా శిబిరంపై పోలీసులు దాడి చేయడాన్ని పీవోడబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక ఖండించారు. ఈ మేరకు కొవ్వూరులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నిరంకుశ, పాసవిక, అణచివేత చర్యలను విడనాడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాగమణి, సత్య వరలక్ష్మి, శ్రీదేవి, చీర అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యు నాయకులు

రేపు రాష్ట్ర బంద్

అంగన్వాడీలకు మద్దతుగా ఈ నెల 24న రాష్ట్ర బంద్ నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తెలిపారు. అంగన్వాడీల సమ్మె శిబిరంపై పోలీసుల దౌర్జన్యాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాలను సీఎం జగన్‌కు సమర్పించడానికి విజయవాడ వెళ్తున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాసవిక విధానాలకు వ్యతిరేకంగా, అంగన్వాడీలకు సంఘీభావంగా ఈ నెల 24న రాష్ట్ర బంద్ చేపట్టి ప్రభుత్వాన్ని ప్రతిఘటించాలని అఖిలపక్ష ట్రేడు యూనియన్లు భావించాయన్నారు. అలాగే కడప, కర్నూలు, అనంతపురం, నంద్యాల జిల్లాల నుంచి నల్లజర్ల, దేవరపల్లి పోలీసుస్టేషన్లకు పెద్దసంఖ్యలో అంగన్వాడీలను తరలించారని, స్టేషన్లు సరిపోక వారందరిని ప్రైవేటు కల్యాణ మండపాల్లో ఉదయం నుంచి నిర్బంధించి అన్నపానీయాలు లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

పోలీసుల ఆదుపులో 127 మంది అంగన్వాడీలు

నల్లజర్ల/కొవ్వూరు, జనవరి 22: సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ వెళుతున్న 159 మంది అంగన్వాడీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. నల్లజర్ల మండలం అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం తెల్లవారుజామున సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ టీవీ సురేష్ తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. విశాఖ నుంచి మూడు బస్సుల్లో విజయవాడ వెళుతున్న 127మంది అంగన్వాడీలను అడ్డుకుని బస్సులను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారిని అచ్చన్నపాలెం కల్యాణ మండపంలో సాయంత్రం వరకు ఉంచి ఆపై స్వగ్రామాలకు పంపించారు. అలాగే కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద సీఐ వి.జగదీశ్వర్రావు ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేసి వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడ జిల్లాకు చెందిన 32 మంది అంగన్వాడీ మహిళలు 2 వాహనాల్లో విజయవాడ వెళ్తుండగా వారందరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. విజయవాడ వెళ్లకుండా వెనక్కి పంపించి వేసినట్టు సీఐ జగదీశ్వర్రావు తెలిపారు.



కొవ్వూరు టోల్‌గేట్ వద్ద అంగన్వాడీలను అడ్డుకున్న సీఐ జగదీశ్వరరావు

రా.. కదలి రా సభను విజయవంతం చేద్దాం

» టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి

» దూబచర్లలో బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన నేతలు



దూబచర్లలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న గోరంట్ల, మద్దిపాటి తదితరులు

నల్లజర్ల, జనవరి 22: మండలంలోని దూబచర్లలో టీడీపీ అధినేత చందరబాబు నిర్వహించనున్న రా.. కదలి రా.. బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. సోమవారం దూబచర్లలో జరిగే బహిరంగ సభ స్థలాన్ని ఆయనతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ఈ నెల 29 లేదా 30వ తేదీలో చంద్రబాబు బహిరంగ సభ దూబచర్లలో జరుగుతుందని, జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి సభను విజయవంతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో టీడీపీని విజయపథంలో నడిపించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలి

కొవ్వూరు, జనవరి 22: జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. సోమవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు కొవ్వూరు టౌన్, మండలానికి సంబంధించి జయహో బీసీ సదస్సు స్థానిక లిటరరీ క్లబ్‌లో జరుగుతుందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు పెద్దపీట వేసిందని, కులవృత్తులను ప్రోత్సహిస్తూ అనేక పథకాలను అందించిందన్నారు. సమావేశంలో గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని, పట్టణ, మండలాధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నాయకులు కాగిత రఘు, తుంపల్లి ఆదినారాయణ, రాజాన శ్రీనివాస్, అర్రిల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీకి వెన్నెముక బీసీలే: బూరుగుపల్లి

పెరవలి, జనవరి 22: టీడీపీకి ఆవిర్భావం నుంచి వెన్నెముక బీసీలేనని, వారి అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేసిందని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. పెరవలి దీపికా ఫంక్షన్ హాలులో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలను అణగదొక్కాలని చూస్తోందని, బీసీల అభివృద్ధికి ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని, అందుకు బీసీలంతా ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ జనరల్ రాష్ట్ర సెక్రటరీ చెల్లుబోయిన శ్రీనివాస్, షేక్ సుభాణి, కుడిపూడి సత్తిబాబు, పాలా వీరాస్వామి, పిప్పర రవి, శ్రీనివాసరావు, బొడ్డు రామాంజనేయులు, అతికాల రామకృష్ణమ్మ, సలాది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మాట్లాడుతున్న టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు



పెరవలి సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి శేషారావు

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులకు నిరసన

చాగల్లు, జనవరి 22: గత 42 రోజులుగా అంగన్‌వాడీలు చట్టబద్ధంగా, శాంతియుతంగా చేస్తున్న సమ్మెను అరెస్టులతో అడ్డుకోవడం దారుణమని సీపీఎం నాయకులు విమర్శించారు. స్థానిక సెంటర్‌లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు సంఘీభావం తెలుపుతూ, అక్రమ అరెస్టులను ఖండిస్తూ స్థానికంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు కేకే దుర్గారావు, జీవీ సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, ఎస్‌కే ఆదాం, జుజ్జువరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిడదవోలు: ఛలో విజయవాడ పిలుపునిచ్చిన అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులు అక్రమ అరెస్టులు చేశారు. సోమవారం అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మేరీ విక్టోరియాను హౌస్ అరెస్ట్ చేయగా విజయవాడకు బైలుదేరిన అంగన్‌వాడీలను రైల్వేస్టేషన్‌లో అడ్డుకున్నారు. విజయవాడకు చేరుకున్న నిడదవోలు అంగన్‌వాడీలను విజయవాడ చేరకుండానే అరెస్ట్ చేసి సమీప పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. అంగన్‌వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబును విజయవాడలో అక్రమ అరెస్ట్ చేసారు.

ఓటరు జాబితాపై అవగాహన ఉండాలి

గోపాలపురం, జనవరి 22: ఎన్నికల నిబంధనలతో పాటు ఓటరు జాబితాపై రాజకీయ నాయకులంతా అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఓటు నమోదు అధికారి వెంకటసుధాకర్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోపాలపురంలో 248 పోలింగ్ బూత్‌లలో 1,18, 723మంది పురుషులు, 1,23,800 మంది స్త్రీలు, ఏడుగురు ట్రాన్స్‌జెండర్లు ఓటుహక్కు కలిగి ఉన్నారన్నారు. బీఎల్‌ఓలు ఓటరు లిస్టులో షిఫ్ట్ అయిన ఓటరు ఏ పోలింగ్‌బూత్‌కి, ఏ విలేజ్‌కి ఏ మండలానికి షిఫ్ట్ అయ్యారో అన్న సమాచారం సమగ్రంగా ఉంచాలన్నారు.

గోపాలపురంలో అంగన్వాడీల దీక్ష

గోపాలపురం, జనవరి 22: అంగన్వాడీలు చేస్తున్న దీక్షను నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అంగన్వాడీలు మాత్ర తమ దీక్షను కొనసాగించారు. ఈ నెల 20వ తేదీకి గడువు ఇచ్చి విధుల్లో చేరాలని ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది. అయినప్పటికీ లెక్క చేయకుండా దీక్ష చేయడంతో విధుల నుంచి తొలగిస్తామని అధికారులు తీవ్ర ఒత్తిడి తేవడంతో నియోజకవర్గ పరిధిలోని గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి మండలాల పరిధిలో 234అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలు 234మంది, ఆయాలు 224మందికి గానూ ఆదివారం నాటికి కార్యకర్తలు 24మంది, ఆయాలు 16మంది విధులకు వెళ్లారు. సోమవారం ఒక్కరోజే 13మంది కార్యకర్తలు, ఆయాలు 14 మొత్తం 27మంది విధుల్లో చేరారు.



కొవ్వూరులో శోభాయాత్ర చేస్తున్న భక్తులు



తాళ్లపూడిలో శోభాయాత్రలో గ్రామస్థులు



తూర్పు, పడమర చోడవరంలో భక్తుల సంకీర్తన

అంతా రామమయం!

» శ్రీరామ నామంతో మార్మోగిన గ్రామాలు

» భజనలు, రామదాసు కీర్తనలతో ఆధ్యాత్మిక శోభ

» రామ, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు, కల్యాణాలు

కొవ్వూరు, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని గ్రామస్థులు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాముడి భజనలు, రామదాసు కీర్తనలతో పరవశించిపోయారు. సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్నుల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీల్లో ఉంచి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవాలు, శోభాయాత్రలు చేపట్టారు. కాషాయ జెండాలతో ర్యాలీలు జరిపారు. కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో వ్యాపారస్తులు శ్రీరాముని చిత్రపటానికి పూజలు చేశారు. పాదాచారులకు రామ నామ తిలకం పెట్టించి, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో పాటు, అటుకులు, బెల్లం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దుల సత్యనారాయణ, పోకల రవి, మధు, శ్రీరంగం శ్రీనివాస్, దేవత ప్రసాద్, గుల్లపూడి శ్రీనివాస్, మద్దుల సోమరాజు పాల్గొన్నారు. అలాగే స్థానిక 6వ వార్డులో గోదావరి గట్టుపై రామ మందిరం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృత పాఠశాల శివాలయంలో ప్రత్యేక భజనలు, శోబాయాత్ర, శ్రీరామ అని దీపాలంకరణ, లఘు అర్చన, ప్రసాద వితరణ చేశారు. గోష్పాదక్షేత్రంలో పవిత్ర జీవన్ సంస్థాన్, అఖండ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో గంగపూజ, దీపావళి వేడుకలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు 108 చీరలతో సారె అందజేశారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో ఆర్ఎస్ఎస్, రామభక్త బృందం ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఉన్న రాముల వారికి అర్చకులు పూజలు, అభిషేకాల అనంతరం శోభాయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇస్కాన్ సంస్థ నుంచి వచ్చిన రథాన్ని పూలతో అలంకరించి, గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రామాలయాల నుంచి వచ్చిన పల్లకీలతో భక్తులు శోభాయాత్ర పూర్తి చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద వేంకటేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరి ఆలయాల వద్ద స్థానిక గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం గ్రామంలోని యువకులు కాషాయ జెండాలతో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు.

నల్లజర్ల: మండలంలోని తూర్పు, పడమర చోడవరం రామాలయంలో భక్తులు రామనామ సంకీర్తన చేశారు. అనంతపల్లి రామాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, శెట్టిపల్లి శివనాగరాజు, బోయపాటి రమేష్ పాల్గొన్నారు. ఘంటావారిగూడెం రామాలయంలో తాతిన పుష్పాంజలి, సత్యనారాయణ ఆధ్వర్యంలో రామనామ సంకీర్తన జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అలాగే పోతవరం, నల్లజర్ల, ప్రకాశరావుపాలెం, దూబచర్లలో రామానామ సంకీర్తన జరిగింది.

పెరవలి: మండలంలోని కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, ముక్కామల, ఖండవల్లి, కాపవరం, కొత్తపల్లిల, అన్నవరప్పాడు, మల్లేశ్వరం ఇతర గ్రామాల్లో రామాలయాలను విద్యుత్‌దీపాలు, వివిధ రకాల పూల దండలతో అలంకరించారు. పలు చోట్ల స్వామి వారి గ్రామోత్సవం, భారీ అన్నసమారాధన నిర్వహించారు. తీపర్రులో టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ పాల్గొని శ్రీరామునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భజన, కోలాట కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన నాయకుడు పత్తిపాటి ప్రసాద్ అన్ని రామాలయాలకు నూతన వస్త్రాలను బహూకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరాముని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కొన్ని చోట్ల స్ర్కీన్‌లు ఏర్పాటుచేసి ప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రజలకు లైవ్‌లో చూపించారు. ఈ సందర్భంగా వేలివెన్నులో నిర్వహించిన శ్రీరామ విజయయాత్రలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు దంపతులు పాల్గొన్నారు. స్వామివారి పల్లకీ శేషారావు మోశారు. శ్రీరామభక్తులు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాడిపర్రులో యువకులు బైక్ ప్రదర్శన చేశారు.

చాగల్లు: మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. హోమాలు, పూజలు, రామనామ సంకీర్తనలు నిర్వహించారు. స్థానిక ఆర్ఎస్ఎస్ సభ్యులు, పండిత పురోహితులు, యువకులు సహా పలువురు స్థానిక సెంటర్ నుంచి శోభ యాత్ర నిర్వహించారు. అయోధ్య రామాలయం, విగ్రహ ప్రతిష్ఠ తదితర వివరాలు తెలియజేస్తూ బైక్‌లపై ర్యాలీ చేశారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానం నుంచి బయలుదేరిన యాత్ర మెయిన్‌రోడ్డు మీదిగా పాటెమ్మపేట, ఇందిరమ్మ కాలనీ, మీనానగరం, నెలటూరు, అశోక్‌నగరంలోని 14 రామాలయాలను చుట్టి ర్యాలీ చేశారు. అనంతరం నందిగంపాడు, ఊనగట్ల గ్రామాల్లో శోభాయాత్రన, బైక్‌ర్యాలీ జరిగింది. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, జైభజరంగదళ్ సభ్యులు, విశ్వహిందు పరిషత్ సభ్యులు, హిందు బంధువులు పాల్గొన్నారు. ఊనగట్ల పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద భక్తులకు ప్రసాదంగా అల్పాహారం అందజేశారు.

గోపాలపురం: గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌లో భక్తులు ద్విచక్రవాహనం పై నిలబడి స్వామివారి జెండా ఊపుతూ తమ భక్తి చాటుకున్నారు.



తీపర్రులో రాములోరికి వస్త్రాలు బహూకరిస్తున్న కుందుల



వేలివెన్నులో శోభాయాత్రలో పాల్గొన శేషారావు దంపతులు



చాగల్లులో శోభ యాత్రలో పాల్గొన్న యువకులు

జగమంతా రామమయం



నిడదవోలులో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న రామభక్తులు

నిడదవోలు, జనవరి 22: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నిడదవోలు పట్టణం మండలం రామమయంగా మారిపోయింది. నిడదవోలులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి మోర్త సాయికుమార్, మోర్త ప్రమోద్‌కుమార్, ముదునూరి వెంకట కిషోర్‌రాజు, మూల్‌సింగ్ రాజ్‌పుత్ నాయకత్వం వహించగా అధిక సంఖ్యలో రామభక్తులు పాల్గొన్నారు. నిడదవోలు గణపతి సెంటరులో వాస విక్లబ్ ప్రతినిధులు దాతల సహకారంతో పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బీవీవీ లక్ష్మణరావు, ఉప్పల సతీష్, విస్సంశెట్టి దత్తాత్రేయ గుప్త, జయవరపు శ్రీను, కొండా నాగబాబు పాల్గొన్నారు.

నిడదవోలు తుది ఓటర్ల జాబితా విడుదల

నిడదవోలు, జనవరి 22: నిడదవోలు మండలం ఉండ్రాజవరం మండలం, పెరవలి మండాలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా ప్రచురణను సోమవారం విడుదల చేశారు. నిడదవోలు మండలంలో పురుషులు 44,871 మంది, స్త్రీలు 47,485 మంది, ఇతరులు 3, ఉండ్రాజవరం మండలం పురుషులు 30,161 మంది, స్త్రీలు 31,702 మంది, ఇతరులు 1, పెరవలి మండలంలో పురుషులు 28,568 మంది, స్త్రీలు 29,082 మంది, ఇతరులు 1, మొత్తం నిడదవోలు నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలకు పురుషులు 1,03,600 మంది, స్త్రీలు 1,08,269 మంది, ఇతరులు 5, మొత్తం 2,11,874 మందిగా ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎమ్.ఝాన్సీరాణి వెల్లడించారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్